PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక :123 | విజయవాడ, ఆదివారం 4 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 4 December 2022 | Rs

రైల్వేలకు రికార్డు స్థాయిలో ఆదాయం

- ప్రయాణికుల ద్వారా ఆర్జన 76 శాతం పెరుగుదల
- కోవిడ్ మునుపటి స్థాయికి రెవెన్యూ

• లోపలి పేజీలో.. •

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నేడు పౌరసన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం పౌరసన్మానం చేయనుంది. పర్యటనలో భాగంగా విజయవాడకు ఆదివారం చేరుకోనున్న ముర్ము అక్కడ నుంచి నేరుగా పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌కు వెళతారు. పౌరసన్మానం అనంతరం రాజ్‌భవన్లో గౌరవ విందు స్వీకరించి విశాఖపట్నం వెళ్లనున్నారు. మధ్యాహ్నం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గన్నవరం ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలుకుతారు. సాయంత్రం విశాఖలో నేవీడే ఉత్సవాల్లో పాల్గొని, అక్కడ నుండి తిరుపతికి చేరుకుంటారు. సోమవారం తిరుమలలో దర్శనం అనంతరం ఢిల్లీ బయలుదేరి వెళతారు.


అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు మొదలైంది

- పదేళ్ల లోపు సర్వీసు ఉంటే ఇంటికే
- ప్రభుత్వ రహస్య ఆదేశాలు
- ఆందోళనలో 2.40 లక్షల మంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు ప్రారంభమైంది. పదేళ్ల లోపు సర్వీసు ఉన్న వారిని ఉద్యోగాల నుండి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు నవంబర్ 28వ తేదినే ప్రభుత్వం అన్ని శాఖలకు ఉత్తర్వులు పంపినట్లు సమాచారం. పై నుండి అందిన ఆదేశాల అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో శనివారం ఈ విషయం రాష్ట్ర వ్యాపస్తంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులలో కలకలం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా పదేళ్లలోపు సర్వీసు ఉన్న 2.40 మంది ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. ఏ రోజైనా తమ ఉద్యోగం రెగ్యులర్ అవుతుందని ఆశించిన వీరందరూ ఇప్పుడు తమ భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళనలో చిక్కుకున్నారు.

ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కష్టాలు తీరుస్తామని జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. 'సమాన పనికి-సమాన వేతనం' ప్రాతిపదికన న్యాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. ఇటీవల ఒడిషా ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుందరినీ క్రమబద్ధీకరించడం, భవిష్యతు_లో అటువంటి నియమాకాల ను చేసేది లేదని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లోనూ ఆశలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే పదేళ్ల సర్వీసు నిండిన వారినందరినీ క్రమబద్ధీ కరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందంటూ వార్తలు కూడా వచ్చాయి. అయితే, ఆచరణలో జరిగింది దానికి భిన్నం. పదేళ్లలోపు సర్వీసు ఉన్న వారిని ఇళ్లకు పంపాలని నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పదేళ్లకన్నా ఎక్కువ సర్వీసు ఉన్న వారిలో కూడా భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమవుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.



// CONFIDENTIAL //

DIRECTORATE OF WORKS ACCOUNTS
AP, IBRAHIMPATNAM, VIJAYAWADA

Memo No.DWA/AP/IBM/Sn.II/A.1/2022-23/ 232 Dated: .12.2022

Sub:- Outsourcing personnel – Outsourcing personnel working in Works Accounts Department - Discontinuation of the services immediately – Instructions issued – Reg.

Ref:- e-office Computer No.1845498 dt.28.11.2022.

*****

It is informed that Government through reference cited have issued instructions to discontinue the services of outsourcing personnel ie., DEOs/Typist/Junior Assistant working in Works Accounts Department of all those who have less than 10 years of service with immediate effect.

All the JDWAs/PAOs/APAOs are directed to discontinue the services of the outsourcing personnel ie., DEOs / Typists / working in their offices who have rendered less than 10 years of services (list enclosed) immediately and report compliance.

Director of Works Accounts
AP, Ibrahimpatnam, Vijayawada

ఎవరెవరిపై వేటు...?

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం నాలుగు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు పడనుంది. వీరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్లు ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఈ విధులు నిర్వహిస్తూ పది సంవత్సరాల సర్వీసు పూర్తి చేయని వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. క్షేత్రస్థాయి నుండి సమాచారం అందిన తరువాత ఏ శాఖకు సంబంధించి ఆ శాఖ విడివిడిగా తొలగింపు ఆదేశాలను జారీ చేయనుందని సమాచారం. శనివారం 'డైరక్టరేట్ ఆఫ్ వర్క్స్ అక్కౌంట్స్' ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఉత్తర్వులలో 'ప్రభుత్వం నుండి ఆదేశాల ప్రకారం పది సంవత్సరాలు పూర్తి కానివారినందరిని తక్షణమే సర్వీసు నుండి నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని జెడిడబ్ల్యుఎలను, పిఎఓలను ఆదేశించారు. ఈ మేరకు తొలగించిన వారిలో మూడు సంవత్సరాల నుండి 8 సంవత్సరాల తొమ్మిది నెలల సర్వీసును పూర్తి చేసిన వారు కూడా ఉన్నారు. పది సంవత్సరాల సర్వీసుకు ఒక్క రోజు తక్కువైనా నిలిపివేయక తప్పదని అధికారులు అంటున్నారు.

విభజన అనంతరం 90 వేల మంది

సమైక్య రాష్ట్ర విభజన అనంతరం 90 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా రిక్రూట్ అయ్యారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రిక్రూట్ మెంట్ కోసం ఏకంగా 'ఆప్కాస్' అనే వ్యవస్థను తీసుకొచ్చింది. దీని ద్వారా రాష్ట్ర కేంద్రంతోపాటు జిల్లాలో కూడా నియామకాలు చేసింది.వీరందరుకూడా తమ ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయని ఆశిస్తూ ఉన్నారు. తాజా ఉత్తర్వులు వీరికి శరాఘాతంగా మారాయి. వీరికి రూ.16 వేల నుంచి రూ.23 వేలలోపు స్వల్ప జీతాలు ఇస్తున్నారు. వీరిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు.

ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి : ఎవి నాగేశ్వరరావు

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 'ఏ ఒక్క ఉద్యోగిని తొలగించం' సమానపనికి సమాన వేతనం' 'ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తాం' అని ప్రతిపక్ష నాయకునిగా జగన్‌మోహన్‌రెడ్డి హామీనిచ్చి, నేడు అందుకు భిన్నంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ ఆదేశాలు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగులను తొలగించేందుకు ప్రయత్నిస్తుండటం తగదన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో జోక్యం చేసుకుని ప్రతిపక్షనేతగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు.



మహాసభలో మాట్లాడుతున్న డిఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచంద్ర డోమ్

హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలు

- డిఎస్ఎంఎం పిలుపు
- ఆజాదీ లేదు.. అమృతోత్సవం ఎలా అని ప్రశ్న
- ప్రారంభమైన మూడవ అఖిల భారత మహాసభ

పాట్నా : కేంద్ర ప్రభుత్వం ఆజాదీ అమృతోత్సవాలు నిర్వహిస్తున్న సమయంలోనూ దేశ వ్యాప్తంగా దళితులపై పెద్ద ఎత్తున దాడులు కొనసాగుతున్నాయని దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) పేర్కొంది. దాడులను తిప్పికొట్టడంతో పాటు, రాజ్యాంగం ఇచ్చిన కనీస హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. బీహార్లోని బెగుసరాయ్‌లో డిఎస్ఎంఎం మూడవ అఖిల భారత మహాసభ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో 'దళితులపై దాడులు, అత్యాచార సంఘటనలు దేశ వ్యాప్తంగా పెరుగుతున్నాయి. రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు నోచుకోలేని పరిస్థితి అనేక రాష్ట్రాలలో ఉంది. ఆజాదీనే లేకపోతే అమృతోత్సవం ఎలా?' అని డిఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచంద్ర డోమ్ ప్రశ్నించారు. అంతకుముందు మహాసభ జరుగుతున్న దినకర్‌భవన్ వద్ద సంఘ పతకాన్ని డిఎస్ఎంఎం అధ్యక్షులు కె.రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. అమర వీరుల స్థూపానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అమరవీరులకు జోహార్లు చెబుతూ చేసిన నినాదాలతోనూ, పాడిన పాటలతోనూ ఆ ప్రాంతం మారుమ్రోగింది. కుల వివక్షను అంతం చేసి, అంతరాలను రూపు మాపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో రాధాకృష్ణన్ అధ్యక్షవర్గాన్ని, స్టీరింగ్ కమిటీని, తీర్మానాల కమిటీని ప్రతిపాదించగా, ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. క్షేత్ర స్థాయి నుండి ఎన్నికైన 325 మంది ప్రతినిధులు మహాసభకు హాజరుకాగా, ఆంధ్ర ప్రదేశ్ నుండి వచ్చిన వారు 23 మంది మిగతా 2లో

బిజెపి హటావో దేశ్ బచావో

- డిఎస్ఎంఎం సౌహార్ధ సభలో ఏచూరి

లోపలి పేజీలో..

ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్ నిర్దోషి

- అదనపు సెషన్స్ కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన కేసులో జెఎన్‌యు మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్‌ను నిర్దోషిగా న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు శనివారం కర్కర్దూమా అదనపు సెషన్స్ జడ్జి ఖజూరి ఖాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ 101/2020పై న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుకర్ పాండే ధ్రువీకరించారు. ఉమర్ ఖలీద్‌తో పాటు యునైటెడ్ ఎగైనెస్ట్ హేట్ సభ్యుడు ఖలీద్ సైఫీని కూడా నిర్దోషిగా కోర్టు ప్రకటించింది. 2020 ఫిబ్రవరి 24న ఢిల్లీలోని చాంద్‌బాగ్ పులియాలో పెద్ద సంఖ్యలో గుంపు గుమిగూడి రాళ్లు రువ్వారని కానిస్టేబుల్ వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేశారు. ప్రభుత్వం ఆస్తి నష్టం నిరోధక చట్టంలోని సెక్షన్ 3, 4, ఆయుధాల చట్టంలోని సెక్షన్ 25, 27తో పాటు ఐపిసి సెక్షన్ 109, 114, 147, 148, 149, 153-ఎ, 186, 212, 353, 395, 427, 435, 436, 452, 454, 505, 34, 120-బి కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫిబ్రవరి 28న కేసు క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ అయింది. ఈ గుంపులో ఉమర్ ఖలీద్ భాగం కానప్పటికీ ఆయన, ఖలీద్ సైఫీలపై నేరపూరిత కుట్ర ఆరోపణలతో కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లో ఉమర్ ఖలీద్, సైఫీలకు బెయిల్ మంజూరు చేస్తూ, వారిని జైలులో ఉంచడానికి అనుమతించలేమని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో దర్యాప్తు పూర్తి అయిందని, ఛార్జిషీట్‌ను కూడా దాఖలు చేశారని పేర్కొంది. కానీ ఢిల్లీ అల్లర్ల వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపిస్తూ తీవ్రవాద నిరోధక చట్టం (యుఎపిఎ) కేసులో వారు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఉమర్ ఖలీద్‌కు బెయిల్ మంజూరు చేయడానికి అక్టోబర్ 18న ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది.

గ్రామీణ ప్రాంతాల్లో తగ్గిన కొనుగోళ్లు!

- ఆహార ఉత్పత్తులకు తగ్గిన గిరాకీ
- ద్రవ్యోల్బణ సవాళ్లే కారణమంటున్న నిపుణులు



ముంబయి : బియ్యం, పాలు, పళ్ళు, కూరగాయలు, సోడా, సాధారణ మందులు వంటి వేగంగా అమ్ముడయ్యే వస్తువుల(ఎఫ్ఎంసిజి)కు గ్రామీణ ప్రాంతాల్లో నవంబరు మాసంలో డిమాండ్ తగ్గింది. పండుగల సీజను ముగిసిన తర్వాత ప్రజల్లో అంత ఊపు, ఉత్సాహం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రాంతాల్లో కూడా డిమాండ్ కొంత మేర దెబ్బతింది. అయితే, నెలవారీ ప్రాతిపదికన చూసినట్లైతే గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ వినిమయ క్షీణత బాగా ఎక్కువగా వుంది.

అక్టోబరు మాసంతో పోల్చినట్లైతే నవంబరులో గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ 17శాతం తగ్గగా, పట్టణ ప్రాంత డిమాండ్ 10.1శాతం తగ్గిందని రిటైల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారం బిజోమ్ డేటా తెలియజేసింది. మొత్తమ్మీద, భారతదేశంలో ఎఫ్ఎంసిజి విక్రయాలు 15.3శాతం తగ్గగా, గత ఏడాదితో పోల్చి చూసినట్లైతే 2.7శాతం తగ్గాయి.

"కిరాణా దుకాణాల్లో నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో నెలవారీ ప్రాతిపదికన చూసినట్లైతే నవంబరులో ఎఫ్ఎంసిజి విక్రయాలు క్షీణించాయి. పండుగల తర్వాత వినిమయం మందగించడంతో వార్షిక విక్రయాలు కూడా సన్నగిల్లాయి." అని బిజోమ్‌లో గ్రోత్ అండ్ ఇన్‌సైట్స్ చీఫ్ అక్షయ్ డిసౌజా తెలిపారు. "పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంత డిమాండ్ బాగా తగ్గింది. ఈ పరిస్థితి మొత్తంగా ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల వినిమయం, వృద్ధిని ప్రభావితం చేస్తోంది. వినియోగ దారులు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఖర్చు చేస్తున్నందున ద్రవ్యోల్బణ సవాళ్లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు కనిపిస్తోంది." అని డిసౌజా పేర్కొన్నారు.

కేటగిరీల వారీగా చూసినట్లైతే బియ్యం, గోధుమ పిండి వంటి ప్యాకేజ్డ్ ఆహార వస్తువుల డిమాండ్ 23.7శాతం తగ్గగా, శీతల పానీయాలు కూడా నెలవారీ ప్రాతిపదికన చూస్తే విలువ పరంగా 13.7శాతం తగ్గాయి. అయితే, వ్యక్తిగత సంరక్షణ కేటగిరీ మాత్రం 3.9శాతం చొప్పున వృద్ధి రేటును నమోదు చేసింది.

నవంబరులో ముఖ్యంగా ఖాద్య తైలాల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని డిసౌజా పేర్కొన్నారు. శీతాకాలం సమీపిస్తున్నందున చర్మ సంరక్షణ ఉత్పత్తులు, హీటర్ల వంటి వాటికి డిమాండ్ బాగా వుందన్నారు.

అదానీ విల్మర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అంగ్షు మాలిక్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌పై తీవ్ర ఒత్తిడి వుందని, "నేను ఊహించినట్లుగా గ్రామీణ ప్రాంత డిమాండ్ పుంజుకోవడం లేదు. పంట దిగుబడుల నుండి రావాల్సిన ఆదాయాలు ఇంకా ప్రజల చేతుల్లోకి రాలేదని అనుకుంటున్నా. ఎందుకంటే ఈ ఏడాది దిగుబడి ఆలస్యమైంది. డిసెంబరు నుండి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకునే అవకాశం వుందని భావిస్తున్నా" అని అన్నారు.

వరిసాగు చేయొద్దు

- ఇతర పంటలపై దృష్టి పెట్టండి : మంత్రి కాకాని
- లాంలో వ్యవసాయ సాంకేతికత ప్రదర్శన

నేడు ఢిల్లీ పుర సమరం

- ఉదయం 8 నుంచే పోలింగ్
- 7న ఫలితాలు


సమస్యలపై దక్షిణ కొరియా ట్రక్ డ్రైవర్ల సమ్మె

- మద్దతుగా వేలాది మంది నిరసన

• లోపలి పేజీలో.. •

హెచ్‌సియు విద్యార్థినిపై లైంగిక దాడికి అధ్యాపకుడు యత్నం

- యూనివర్సిటీ గేటు వద్ద విద్యార్థుల బైఠాయింపు
- అధ్యాపకుడిని సస్పెండ్ చేసిన యాజమాన్యం



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో


రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) విద్యార్థినిపై అదే యూనివర్సిటీకి చెందిన అధ్యాపకుడు లైంగిక దాడికి యత్నించాడు. హిందీ నేర్పిస్తానని నమ్మబలికి తన ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడబోయాడు. బాధిత విద్యార్థిని ఫిర్యాదు మేరకు అధ్యాపకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థుల ఆందోళనతో యాజమాన్యం స్పందించి అధ్యాపకుడిని సస్పెండ్ చేసింది. పోలీసులు, విద్యార్థుల కథనం ప్రకారం... థాయిలాండ్‌కు చెందిన యువతి ఉన్నత చదువుల కోసం హెచ్‌సియులో చేరారు. హిందీ ప్రొఫెసర్ రవిరంజన్ ఆ విద్యార్థినికి హిందీ నేర్పిస్తానని నమ్మబలికి శుక్రవారం రాత్రి క్యాంపస్ నుంచి తన ఇంటికి తీసుకెళ్లి మద్యం తాగించాడు. అనంతరం ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఆ యువతి ప్రతిఘటించడంతో ఆమెపై రవిరంజన్ చేయిచేసుకున్నాడు. ఆ తర్వాత కారులో తీసుకొచ్చి యూనివర్సిటీ గేటు దగ్గర వదిలిపెట్టి వెళ్లాడు. అక్కడి నుంచి బాధితురాలు నేరుగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, ప్రొఫెసర్ రవిరంజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ఐపిసి 354, 354 'ఎ' సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్టు మాదాపూర్ ఎసిపి రఘునందన్‌రావు తెలిపారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థినిపై లైంగిక దాడి ప్రయత్నించిన హిందీ అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్‌సియు గేటు వద్ద విద్యార్థి సంఘాలు శనివారం ఆందోళనకు దిగాయి. బాధిత విద్యార్థినికి న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ విద్యార్థినీ, విద్యార్థులు బైటాయించారు. బాధిత విద్యార్థిని థాయ్‌లాండ్ ఎంబసికి కూడా ఫిర్యాదు చేసింది. ఈనేపథ్యంలో యూనివర్సిటీ యాజమాన్యం అధ్యాపకుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో, విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షల్లో సాయిశ్రీనివాస్‌కు జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్

ప్రజాశక్తి- మార్కాపురం (ప్రకాశం జిల్లా)




ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఆధ్వర్యంలో గత నెల ఆరో తేదీన జాతీయ స్థాయిలో జరిగిన సూపర్ స్పెషాలిటీ (డిఎం) ప్రవేశ పరీక్షలో ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ గుర్రం సాయిశ్రీనివాస్ దేశంలోనే రెండో ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆయన పాండిచ్చేరిలో ఎండి పిడియాట్రిక్స్ కోర్సు చేస్తున్నారు. ఇది ఈ నెల చివరి నాటికి పూర్తి కానుంది. వచ్చే జనవరిలో డిఎం కోర్సులో చేరనున్నారు. సాయిశ్రీనివాస్ తండ్రి డాక్టర్ జి.మోహన్‌రామ్ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్. ఆమె తల్లి రాధిక కూడా వైద్యురాలే. 2014లో నాటి ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎంసెట్ ప్రవేశ పరీక్షలో సాయిశ్రీనివాస్ ప్రథమ ర్యాంకు సాధించారు.

'శ్రీశైలం'పై ఏకాభిప్రాయం

మిగులు జలాలపై స్పష్టత

రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటి విడుదల, జల విద్యుత్ పంపిణీ విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. హైదరాబాద్ జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసి) కన్వీనర్ ఆర్.కె.పిళ్లై అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కెఆర్ఎంబి సభ్యులు మౌంతాగ్, తెలంగాణ నీటిపారుదలశాఖ ఇఎన్‌సి మురళీధర్, జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజాం, ఎపి జలవనరులశాఖ ఇఎన్‌సి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులపై చర్చ జరిగింది. సమావేశానంతరం ఆర్‌కె పిళ్లై మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నుండి జల విద్యుత్‌ను చెరిసగం వినియోగించుకునేందుకు ఇరు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయన్నారు. మిగులు జలాల విషయంలో స్పష్టత వచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తిగా నిండి ఓవర్‌ఫ్లో అయ్యాకే వరదను మిగులు జలాల కింద పరిగణించాలని ఇరు రాష్ట్రాలు సూచించాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోకి కృష్ణానది ప్రవేశించాక సరిహద్దు నుంచి ప్రతి నీటి చుక్కా లెక్కించాలన్న నిర్ణయానికి రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయన్నారు. రెండు రాష్ట్రాల అంగీకారంతో ప్రాజెక్టు నిబంధనల్లో మార్పులు చేయనున్నట్లు చెప్పారు.

నాగార్జునసాగర్‌పై సోమవారం చర్చలు

శనివారం జరిగిన చర్చల్లో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిబంధనల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. దీంతో కేంద్ర జలసంఘం అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించినట్టు ఆర్.కె.పిళ్లై వివరించారు. ఎపి ఇఎన్‌సి నారాయణరెడ్డి మాట్లాడుతూ మిగులు జలాలుగా సముద్రంలో వృథాగా కలిసే నీటిని లెక్కించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

రైల్వేలకు రికార్డుస్థాయిలో ఆదాయం

- ప్రయాణికుల ద్వారా ఆర్జన 76 శాతం పెరుగుదల
- కోవిడ్ మునుపటి స్థాయికి రెవెన్యూ

న్యూఢిల్లీ : రైల్వేలు నష్టాల్లో నడుస్తున్నాయంటూ ప్రయివేటుకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వాదన ఏమాత్రం పసలేనిదని తేలిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 8 నెలల్లో ప్రయాణికుల ద్వారా ఆదాయం గతేడాదితో పోలిస్తే 76 శాతం పెరిగింది. గత నవంబరు ఆఖరు వరకు భారతీయ రైల్వే ప్రయాణీకులకు అందించిన వివిధ రకాల సేవల నుంచి మొత్తం రూ.43,324 కోట్లు ఆర్జించింది. గతేడాది ఇదే కాలానికి కేవలం రూ.24,631 కోట్లు రెవెన్యూ వచ్చింది. గతేడాది రిజర్వుడు సెగ్మెంట్‌లో రూ.22,904 కోట్లు రాగా ఈ ఏడాది రూ.34,303 కోట్లు ఆదాయం లభించింది. అన్ రిజర్వుడు అంటే సాధారణ టిక్కెట్ల మీద గతేడాది కంటే 422 రెట్లు ఎక్కువ రెవెన్యూ సాధించి రూ.9021 కోట్లు ఆర్జించింది. కోవిడ్ కారణంగా 2021, 22 ఆర్థిక సంవత్సరాల్లో రైళ్ల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు కొనసాగిన సంగతి తెలిసిందే. 2022 ఏప్రిల్ – నవంబరు మధ్య కాలంలో ప్రయాణికుల ద్వారా ఆర్జించిన ఆదాయం గణనీయమైన స్థాయిల్లో ఉంది. 2018, 2019 ఆర్థిక సంవత్సరాల్లో ఇదే కాలానికి ఆర్జించిన రెవెన్యూ కంటే ఇది అధికమని రైల్వే గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంటే రెవెన్యూ సృష్టించే గొప్ప వనరుగా ప్రయాణికులకు అందించే సేవలు నిలిచాయి. 2018లో రూ.33900 కోట్లు, 2019లో రూ.35255 కోట్లు మేర రైల్వేకు ప్రయాణికుల ద్వారా లభించింది. ఈ ఏడాది అంతకుమించి ఆదాయం ఆర్జించడం విశేషం. రిజర్వు చేసుకోవడం ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికుల సంఖ్య గతేడాది 48.6 కోట్ల మంది కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 10 శాతం మేర పెరిగింది. ఈ ఏడాది 53.65 కోట్ల మంది టిక్కెట్లను రిజర్వు చేసుకున్నారు.

పార్లమెంట్ సమావేశాలకు రాహుల్ గైర్హాజరు!

న్యూఢిల్లీ : కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు గైర్హాజరు కానున్నారు. రాహుల్‌గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేష్ సమావేశాల్లో పాల్గొనడం లేదని శనివారం సంబంధిత వర్గాలు తెలిపాయి. వీరిరువురు రాహుల్‌తో పాటు భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్నారు. యాత్రను మధ్యలో నిలిపివేయడం అధిష్టానానికి ఇష్టంలేదని .. అందుకే సీనియర్ నేతలు శీతాకాల సమావేశాలకు గైర్హాజరుకానున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రాహుల్ భారత్‌జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో కొనసాగుతోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 7వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సమావేశాలు ఒక నెలరోజులు ఆలస్యంగా ప్రారంభంకానున్నాయి.

కరోనాపై అప్రమత్తత తప్పనిసరి : డబ్ల్యుహెచ్ఒ

జెనీవా : కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందేనని, లేకపోతే మరో కొత్త వేరియంట్ విరుచుకుపడే అవకాశాలు లేకపోలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) హెచ్చరించింది. కరోనా కొత్త వేరియంట్‌లతో విరుచుకుపడటంతో ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు అరవై లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. నిఘా, పరీక్షలు, వ్యాక్సిన్‌లతో వైరస్‌పై నియంత్రణ సాధించగలిగామని పేర్కొంది. కరోనాను అడ్డుకునే వ్యూహాత్మక యత్నాల వైఫల్యంతో ఈ ఏడాది కొత్త వేరియంట్ పుట్టుకువచ్చే పరిస్థితులు ఉండవచ్చుని డబ్ల్యుహెచ్ఒ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనామ్ తెలిపారు.

మహమ్మారి అత్యవసర దశ ముగిసిందని చెప్పడానికి దగ్గరగా ఉన్నప్పటికీ.. ఇప్పుడే ప్రకటించలేమని చెప్పారు. చైనాలో వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీర్ఘకాల రోగాలు కలిగిన వారు, 60 ఏళ్లు దాటిన వారిపై చైనా సహా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని డబ్ల్యుహెచ్ఒ టెక్నికల్ లీడ్ మారియా వాన్ ఖేర్గోవ్ తెలిపారు. ప్రపంచ జనాభాలో దాదాపు 90 శాతం మంది ఇప్పటికే కరోనా వైరస్ సోకడం ద్వారా, వ్యాక్సిన్ కారణంగా కొంతమేర రోగనిరోధక శక్తిని కలిగి ఉన్నారని డబ్ల్యుహెచ్ నివేదిక పేర్కొంది.

హక్కుల పరిరక్షణ కోసం ఐక్యపోరాటాలు

మొదటిపేజీ తరువాయి

ఉన్నారు. అనంతరం నివేదికను ప్రవేశపెట్టిన ప్రధాన కార్యదర్శి రామచంద్ర డోమ్ మాట్లాడుతూ ఒకవైపు ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని హక్కులను కూడా హరిస్తోందని, సామాజిక రిజర్వేషన్లను సైతం దూరం చేస్తోందన్నారు. వీటి పరిరక్షణ కోసం, విద్య, వైద్యం వంటి కనీస హక్కుల కోసం ఐక్యపోరాటాలను ఉధృతం చేయాల్సిఉందన్నారు. ఈ దిశలో ప్రతి కార్యకర్త కృషి చేయాలని, క్షేత్ర స్థాయిలో కలిసి వచ్చే ప్రతి ఒక్కరిని కలుపుకొని పోరాటాలను నిర్వహించాలని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. 2011లో దేశ వ్యాప్తంగా 33,700 దాడులు నమోదుకాగా, 2020కి వీటి సంఖ్య 50,291కి పెరిగిందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే దాడుల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వీటిని తిప్పికొట్టి, రాజ్యాంగంలో పేర్కొన్న హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉమ్మడి పోరాటాలకు సిద్ధపడాలని చెప్పారు.

వరిసాగు చేయొద్దు

ఇతర పంటలపై దృష్టి పెట్టండి : మంత్రి కాకాని

- లాంలో వ్యవసాయ సాంకేతికత ప్రదర్శన



అగ్రిటెక్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గోవర్ధనరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతులందరూ వరి సాగుచేస్తే గిట్టుబాటు ధర లభించడం కష్టమని.. పత్తి, ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన అగ్రిటెక్–2022 ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆచార్య ఎన్.జి.వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా ఉద్యాన, వ్యవసాయ, ప్రకృతి సేద్యం శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, వివిధ రకాల కంపెనీల విత్తన, పురుగుమందులు, ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాల స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందుబాటులో ఉంచటంతో పాటు రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికారాలకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు, మార్కెటింగ్ సౌకర్యాలకు గోడౌన్లు, విలువ ఆధారిత ఉత్పత్తులలో ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లను ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను రైతు ఉత్పత్తి సంఘాలకే అప్పగిస్తున్నామని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు నూరు శాతం రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత బీమా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అనంతరం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్రోన్ పైలెట్ శిక్షణను పూర్తి చేసుకున్న తొలి బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వివిధ పరిశోధన సంస్థలు, విస్తరణ కేంద్రాలు రూపొందించిన లఘు చిత్రాలు, వ్యవసాయ ప్రచురణలను ఆవిష్కరించారు. వ్యవసాయ విద్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడానికి వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రదర్శన, పంటల సాగును వివిధ పాఠశాలలు, కళాశాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ శాసన సభ్యులు డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, వైస్ ఛాన్సలర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు (వ్యవసాయం, మార్కెటింగ్) బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరిలో యువతిని హత్యచేసిన వారిపై చర్యలు

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

చంద్రగిరిలో కులదురహంకారంతో యువతి మోహన్‌కృష్ణను హత్య చేసిన కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల క్రితం మోహనకృష్ణ అనే అమ్మాయి కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు చెప్పి, అసలు విషయాన్ని పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక ద్వారా అసలు విషయం బయట పడిందని తెలిపారు. ఆమె దళిత యువకుడిని ప్రేమించినందుకు పరువు పోతుందని, అంతటి ఘోరానికి పాల్పడ్డారంటే సమాజంలో నేటికీ స్త్రీకి వ్యక్తిత్వం ఉంటుందనే అంశాన్ని గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో సత్వర విచారణ జరపాలని ఐద్వా నేతలు పేర్కొన్నారు.

టీచర్ల సర్దుబాటుపై కలెక్టర్ల సమావేశం

- పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టీచర్ల సర్దుబాటుపై జిల్లా కలెక్టర్లు సమావేశం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణతో మిగిలిన ఉపాధ్యాయులు, పదోన్నతులు పొందిన వారిని సర్దుబాటు చేసేందుకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్దుబాటుపై జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా కమిటీలను ఏర్పాటు చేసింది. పాత జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, కొత్త జిల్లా కలెక్టర్ కో ఛైర్మన్‌గా, పాత డిఇవో కన్వీనర్‌గా, కొత్త డిఇవో సభ్యుడిగా ఈ కమిటీలో ఉంటారు. కలెక్టర్లు ఈ నెల 6వ తేదీన సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. పదోన్నతులు పొందిన వారు, మిగులుగా తేలిన వారిని కొత్త పాఠశాలల్లో సర్దుబాటు చేయాల్సి ఉంది. ఉన్నత పాఠశాలల్లో (3–10, 6–10) స్కూల్ అసిస్టెంట్లను డిప్యుటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టుకు కనీసం ఒక ఉపాధ్యాయుడు ఉండేలా స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేయాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు మ్యాపింగ్ చేసిన చోట సబ్జెక్టు ఉపాధ్యాయుల కోసం స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని ఆదేశించారు. మిగులుగా ఉన్న ఎస్‌జిటిలను ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ బడులకు కేటాయించాలి. ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేసేందుకు స్కూల్ అసిస్టెంట్లు సరిపోకపోతే ఎస్‌జిటిలను డిప్యూటేషన్ పద్ధతిలో పంపాలని పేర్కొన్నారు. ఈ ప్రకియ మొత్తాన్ని పూర్తిచేసి పాఠశాలలు వారీగా డిప్యుటేషన్‌పై పంపే ఉపాధ్యాయుల వివరాలను 8వ తేదీలోపు పంపాలని ఆదేశించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి

న్యాయరాజధాని 'సీమ' ప్రజల హక్కు

- పది రాష్ట్రాల్లో వికేంద్రీకరణ పాలన : మంత్రి బుగ్గన

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

న్యాయ రాజధాని సీమ ప్రజల హక్కు అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. దేశంలో సుమారు పది రాష్ట్రాల్లో వికేంద్రీకరణ పద్ధతిలోనే పాలన కొనసాగుతోందని చెప్పారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీస్ ఖాన్, మేయర్ బివై.రామయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుకతో పాటు జెఎసి నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శివరామకృష్ణ కమిటీ తన నివేదికలో పేర్కొందని తెలిపారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం శ్రీకృష్ణ కమిటీ కూడా కొన్ని ప్రత్యేక అంశాలను ప్రతిపాదించిందన్నారు. సీమ ప్రజల భవిష్యత్తు కోసం ప్రతిపక్షాలు కూడా పోరాడాలని కోరారు. ఈ నెల ఐదున నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో జరగనున్న 'రాయల సీమ గర్జన' సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు సిత్ర సత్యనారాయణమ్మ, జెఎసి చైర్మన్ విజయ కుమార్ రెడ్డి, వైసిపి బిసిసెల్ నాయకులు దేవపూజ ధనుంజయ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎంపి అండతో పేకాట శిబిరాలు

- సిఎంకు టిడిపి ఎమ్మెల్యే అనగాని లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు, కృష్ణా నదీతీరంలో వైసిపి ఎంపి మోపిదేవి వెంకటరమణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు శనివారం లేఖ రాశారు. ఈ జూద కేంద్రాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పేకాట కేంద్రాల్లో సర్వస్వం కోల్పోయి గుండెపోటుతో రెండురోజుల క్రితం ఒకరు మరణించారని వివరించారు. 'జూద కేంద్రాలు నిర్వహిస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, కచ్చితంగా చర్యలు ఉంటాయని' జూద నియంత్రణ బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చలో సిఎం చెప్పినా, నేటికీ నెరవేరలేదని పేర్కొన్నారు. వెంటనే పేకాట క్లబ్బులను మూసివేయించి నదీతీర ప్రాంతంలో పోలీసుల గస్తీ, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశ్రామిక రంగం కుదేలు : ధూళిపాళ్ల

జగన్ ట్యాక్స్, వైసిపి నేతల వేధింపులు, ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర పారిశ్రామిక రంగం కుదేలైందని టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ విమర్శించారు. ప్రభుత్వ అసంబద్ధ విధానాలతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం నుంచి పరారవుతున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపిలో కప్పం కట్టలేకే ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నామని పారిశ్రామికవేత్తలు బహిరంగంగానే చెబుతున్నారని విమర్శించారు.

చంద్రబాబు సభలను చూస్తే వైసిపికి భయం : వర్ల రామయ్య

చంద్రబాబు సభలకు పోటెత్తిన జనాన్ని చూసి వైసిపి నేతల గుండెలవిసిపోతున్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణతో నిన్నటి వరకూ గాల్లో తిరిగిన సిఎం నేలకు దిగారని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో ముగిసిన ఇడి తనిఖీలు

రూ.30 నుంచి రూ.40 కోట్లు పక్కదారి పట్టినట్లు సమాచారం...?

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం చినకాకానిలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో ఇడి అధికారుల సోదాలు శనివారంతో ముగిశాయి. ఏకకాలంలో విజయవాడ, మంగళగిరి, ఒడిశాల్లో సోదాలు నిర్వహించారు. యాజమాన్య సీట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో ఇడి అధికారులు పలు కీలక ఆధారాలను రాబట్టినట్లు తెలిసింది. ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల ఆస్పత్రి డైరెక్టర్‌గా పని చేసిన అక్కినేని మణి ఎన్‌ఆర్‌ఐ నిధులతో సొంత ఆస్పత్రికి వైద్య పరికరాలు కొన్నారనే ఆరోపణలపై ఆధారాలు సేకరించినట్లు సమాచారం. 2022 ఆగస్టులో డాక్టర్ మణి.. అక్కినేని ఉమెన్స్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ క్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి నిధులు అక్కినేని ఆస్పత్రికి తరలించారనే ఆరోపణలు రావడంతో ఇడి అధికారులు సోదాలు చేపట్టారు. కరోనా సమయంలో రోగుల వివరాలు నమోదు చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేసి సుమారు రూ.30 నుంచి రూ.40 కోట్లు పక్కదారి పట్టినట్లు, 1500 మంది రోగులకు సంబంధించిన రికార్డులు మాయం చేసినట్లు తనిఖీలో బహిర్గతమైనట్లు సమాచారం. డైరెక్టర్‌లు నళినీమోహన్, గోపాల శ్రీనివాసరావు ఆర్థిక వ్యవహారాలపై కూడా విచారణ జరిగినట్లు తెలిసింది.

డైరెక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్‌తోపాటు మరికొంతమందిని విచారించినట్లు సమాచారం. పాత మేనేజ్‌మెంట్ డైరెక్టర్ల ఇళ్లల్లోనూ సోదాలు జరిగాయి. ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి సంబంధించి మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను కూడా ఇడి అధికారులు సేకరించారు. అయితే అధికారికంగా వివరాలను ధ్రువీకరించాల్సి ఉంది.

తీహార్ జైల్‌కి నకిలీ సిబిఐ అధికారి

14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన సిబిఐ కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నకిలీ సిబిఐ అధికారి కొవ్విరెడ్డి శ్రీనివాసరావును తీహార్ జైల్‌కి తరలించారు. ఆయనకు సిబిఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 16 వరకూ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సిబిఐ ప్రత్యేక కోర్టు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ కుమార్ ముందు సిబిఐ శనివారం వాదనలు వినిపించింది. నిందితుడిని విచారించేందుకు మరికొన్ని రోజులు కస్టడీ కొనసాగించాలని సిబిఐ తరపు న్యాయవాది కోరారు. ఎనిమిది రోజుల కస్టడీలో ఆరుగురు సాక్షులను విచారణ జరిపామని, ఇందులో తెలంగాణకు చెందిన విఐపిలు ఉన్నారని తెలిపారు. వీరి నుంచి ఎటు వంటి ఆధారాలు దొరకలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను విచారించాల్సి ఉందని, నేరుగా శ్రీనివాసరావుతో కలిపి విచారణ జరపాల్సి ఉందన్నారు.


నేడు ఢిల్లీ పుర సమరం

- ఉదయం 8 నుంచే పోలింగ్
- 7న ఫలితాలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరమైన ఢిల్లీ మహానగర పుర పాలక సంస్థ (ఎంసిడి) ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఎంసిడిలో మొత్తం 250 ఎంసిడి వార్డులున్నాయి. 709 మంది మహిళలు సహా మొత్తం 1349 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలు ఇదే నెల 7న ప్రకటిస్తారు. 1.46 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వార్డుల పునర్విభజన ప్రక్రియ తర్వాత తొలిసారి పోలింగ్ నిర్వహిస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 40 వేల మంది పైగా ఢిల్లీ పోలీసు అధికారులను నగరమంతా మోహరింపజేశారు. వీరితో పాటు 20 వేల మంది హోంగార్డులు, 108 సిఎపిఎఫ్, ఎస్ఎపి కంపెనీల బలగాలను కూడా భద్రత కోసం రంగంలోకి దించారు. ఎన్నికల కోసం ఢిల్లీలోని పాఠశాలన్నిటిని శనివారం నుంచే మూసివేయించారు. సోమవారం కూడా పాఠశాలలు మూసివుంటాయి. ఎన్నికల కోసం ఢిల్లీ మెట్రో ఉదయం 4 నుంచే సర్వీసులు నడపనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ శనివారం సాయంత్రం 5.30 నుంచి ఆదివారం సాయంరతం 5.30 మద్యం అమ్మకాలపై నిషేదం విధించింది. ఎన్నికల ఫలితాల వెల్లడి రోజు కూడా మద్యంపై నిషేదం ఉంటుంది.

త్రిముఖ పోటీ

ఈ దఫా పురపాలక సంస్థ ఎన్నికల్లో స్థూలంగా బిజెపి, ఆమాద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ 247 స్థానాల్లో పోటీ చేస్తుండగా, బిజెపి, ఆమాద్మీ పార్టీలు 250 స్థానాల్లో బరిలో నిలిచాయి. ఈ దఫా ఎన్నికల్లో కొన్ని కీలక వార్డుల్లో వామపక్షాలు కూడా ప్రధాన పోటీదారుగా బరిలో నిలిచాయి. సిపిఎం ఆరు వార్డుల్లో అభ్యర్థులను బరిలో నిలిపి పాలకపక్షాలకు గట్టి పోటీనిస్తోంది. హెూలంబి కలాన్ వార్డు నుంచి షబ్నమ్, ముకుందాపూర్ వార్డు నుంచి శత్రుఘ్న కుమార్, మిఠాపూర్ వార్డు నుంచి లతా తివారి పోటీ చేస్తుండగా, పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నేపథ్యంలో 2022లో ఘర్షణల్లో ఆస్తులను, ఆస్తులను కోల్పోయి బాధిత ప్రాంతంగా ఉన్న ముస్తఫాబాద్ వార్డులో జీనత్ జెహ్రా పోటీ చేస్తున్నారు. సభాపూర్ నుంచి అశోక్ పొద్దార్, జనక్‌పురి సౌత్ వార్డు నుంచి రీనా దేవి పోటీ చేస్తున్నారు. సిపిఐ మూడు స్థానాల్లోనూ, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) 5 వార్డుల్లోనూ, ఫార్వర్డ్‌బ్లాక్ మూడు వార్డుల్లోనూ పోటీ చేస్తోంది. ప్రజా సమస్యల ప్రధాన అజెండాగా వామపక్షాలు ప్రచారం చేశాయి.



సిఎఎ ఘర్షణల్లో కాషాయ మూకల దాడిలో తీవ్ర నష్టాలపాలైన బాధితులకు సిపిఎం అండగా నిలిచింది. కుట్టుమిషన్లు వంటివి పంపిణీ చేసి స్వయం ఉపాధి కోసం ఎంతో సహాయ సహకారాలందించింది. బిజెపి, ఆమాద్మీ, కాంగ్రెస్ మూడు పార్టీలూ వీరిని పట్టించుకోలేదు. బాధితుల్లో ఎక్కువమంది మైనార్టీలు కావడంతో ఓటింగ్ బ్యాంకు రాజకీయాల కోసం వారి పట్ల పాలక పక్షాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. సిపిఎం మాత్రం అక్కున చేర్చుకొని అండగా నిలిచింది. దీంతో పాటు అక్రమ కట్టడాలుగా పేర్కొంటూ మైనార్టీల ఆవాసాలను అన్యాయంగా కూల్చివేస్తుంటే సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ బుల్డెజర్లకు ఎదురు నిలిచి పోరాడిన దృశ్యాలు మైనార్టీలకు ఎంతో భరోసా కల్పించాయి. ఈ పరిణామాలతో ఆ ప్రాంతంలో వామపక్షాల పట్ల ఆదరణ పెరిగింది. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి పుర పాలక సంస్థను అవినీతిలో ముంచేసిందని విమర్శలున్నాయి.



బాలోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమరావతి బాలోత్సవం కమిటీ నేతలు

జనవరి 29 నుంచి అమరావతి బాలోత్సవం

ప్రజాశక్తి – విజయవాడ

జనవరి 29 నుంచి 31వ వరకు అమరావతి బాలోత్సవం నిర్వహించనున్నట్లు బాలోత్సవం అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. విజయవాడ వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. నగరంలోని బాలోత్సవం భవన్‌లో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. బాలోత్సవంలో భాగంగా సబ్ జూనియర్స్ (2, 3, 4 తరగతులు), జూనియర్స్ (5, 6, 7 తరగతులు), సీనియర్స్ (8, 9,10 తరగతులు) విభాగాలుగా 42 అకడమిక్, 16 కల్చరల్ విభాగంలో మొత్తం 58 అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అకడమిక్‌లో చిత్రలేఖనం, కార్టూన్, వ్యాసరచన, తెలుగులో మాట్లాడటం, కథా విశ్లేషణ, కవితా రచన, కథా రచన, వక్తృత్వం, మెమొరీ టెస్ట్, క్విజ్, స్పెల్ బి, బెస్ట్ ఫ్రం వేస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, వార్తా రచన, పద్యం భావం, మట్టితో బొమ్మలు, మ్యాప్, దినపత్రిక పఠనం, డిబేట్, అంతర్జాలంలో అన్వేషణ, కథ చెబుతాను ఊ కొడతారా వంటి అంశాలుంటాయని పేర్కొన్నారు. కల్చరల్‌లో ఏకపాత్ర, విచిత్ర వేషం, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, జానపద గీతాలాపన, జానపద నృత్యం, క్లాసికల్ డాన్స్, లఘునాటిక, కోలాటం, ఫాన్సీ డ్రస్, రైమ్స్ (తెలుగు, ఇంగ్లీష్) అంశాలుంటాయని తెలిపారు. విజయవాడ నగరం, చుట్టుపక్కల ఉన్న మున్సిపాలిటీలు, మండలాల నుంచి ప్రభుత్వ, మున్సిపల్, ప్రయివేటు, ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 15 నుంచి అన్ని పాఠశాలలకు బ్రోచర్లు, ఎంట్రీ ఫారాలను అందిస్తామన్నారు. ఉత్సవ కమిటీ బాధ్యులు గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వి.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ట్రక్ డ్రైవర్ల సమ్మె

మద్దతుగా దక్షిణ కొరియాలో వేలాదిమంది నిరసన

సియోల్ : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస సరుకు రవాణా ధరలను ప్రకటించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని వారం రోజులుగా విధులు బహిష్కరించి వేలాదిమంది ట్రక్కు డ్రైవర్లు చేస్తున్న సమ్మె ఉధృతమైంది. తిరిగి పనుల్లోకి రావాల్సిందిగా వారిపై ప్రభుత్వం నిర్బంధ కాండకు దిగుతోంది. ప్రభుత్వ ప్రయత్నాలను నిరసిస్తూ శనివారం రాజధాని సియోల్‌లో సంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు, ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరియా వాణిజ్య సంఘాల సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ నేతృత్వంలోని ప్రభుత్వం కార్మికుల అణచివేత చర్యలకు పాల్పడుతోందని వారు విమర్శించారు. ట్రక్కర్లు ఎదుర్కొంటున్న కఠిన పని పరిస్థితులను, వారి ఆర్థిక పోరాటాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ఇంధన ధరలతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. వెంటనే విధులకు హాజరు కావాలంటూ దాదాపు 2,500మంది ట్రక్కు డ్రైవర్లకు ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సమ్మె కొనసాగించాలని యూనియన్లు నిర్ణయించాయి. కార్గో ట్రక్కర్ల సంఘీభావ సంఘానికి చెందిన వేలాదిమంది సభ్యులు గత వారం నుండి సమ్మె చేస్తున్నారు. కనీస సరుకు రవాణా రేటు వ్యవస్థను శాశ్వతంగా రూపొందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సిమెంట్, షిప్పింగ్ కంటెయినర్లకు మాత్రమే ప్రస్తుతం కనీస ధరలు అమలవుతున్నాయి. ఇతర సరుకులకు కూడా ఈ ప్రయోజనాలు వర్తింపజేయాలని ట్రక్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

అమెరికాకు అప్పగించొద్దు

ఇసిహెచ్‌ఆర్‌కు అసాంజె లేఖ

బ్రసెల్స్ : తనను అమెరికాకు అప్పగించేందుకు బ్రిటన్ ఇచ్చిన అనుమతిని నిలువరించాలని కోరుతూ వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె యురోపియన్ మానవ హక్కుల కోర్టు (ఇసిహెచ్‌ఆర్)కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక లేఖ అందజేశారు. అసాంజె మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఆయనను అమెరికాకు అప్పగిస్తే ఆత్మహత్య చేసుకునే ప్రమాదముందంటూ తొలుత బ్రిటన్ న్యాయమూర్తి తిరస్కరించారు. అమెరికా అధికారులు పలు రకాలుగా హామీలివ్వడంతో బ్రిటన్ ప్రభుత్వం అప్పగింతకు అనుమతించింది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ లండన్ హైకోర్టులో అసాంజె అప్పీల్ చేశారు. వచ్చే ఏడాది దీనిపై విచారణ జరుగుతుందని భావిస్తున్నారు. ఈ కేసును ఇసిహెచ్‌ఆర్ పరిశీలించాల్సిన అవసరం లేదని, బ్రిటన్‌లోనే ఇది పరిష్కారం కావాలని అసాంజె భాగస్వామి స్టెల్లా వ్యాఖ్యానించారు.

ఉపాధ్యాయులు కోరితే బోధనేతర విధులూ తప్పిస్తాం : మంత్రి బొత్స

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల కోరిక మేరకే ఎన్నికల విధుల నుంచి వారిని తప్పించామని, వారు కోరితే మనబడి నాడు–నేడు బాధ్యతలు, బోధనేతర విధుల నుంచి కూడా తప్పిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఈ నెల ఏడున జరిగే జయహో బిసి మహాసభ జయప్రదానికి సన్నాహక సమావేశం శ్రీకాకుళంలోని వైసిపి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఓటమి భయంతోనే ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. తమకు ఏ విధమైన బోధనేతర విధులూ ఉండకూడదని, బోధించడం తప్ప ఇతర ఏ విధమైన కార్యక్రమాలూ తమకు అప్పగించొద్దని ఉపాధ్యాయులు కోరారని తెలిపారు. దీన్ని పరిగణనలోకి తీసుకొనే వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించామని చెప్పారు. విలేకర్లు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏం పెట్టుబడులు తెచ్చారో చెప్పాలన్నారు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రకు ఒక్క కంపెనీ కూడా తేలేకపోయారని, రాజశేఖరరెడ్డి హయాంలోనే విశాఖ ఐటి హబ్, ఫార్మా హబ్ వచ్చాయని తెలిపారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. తాము బిసిలకు చేసింది చెప్పేందుకే విజయవాడలో ఈ నెల ఏడున జయహో బిసి మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభకు బిసి నేతలంతా తరలి రావాలని కోరారు. మంత్రి సీదిరి అప్పలరాజు, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, శ్రీకాకుళం జడ్‌పి చైర్‌పర్సన్ విజయ, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కిల్లి కృపారాణి పాల్గొన్నారు.

5 నుంచి ఎన్నికల బాండ్ల జారీ

న్యూఢిల్లీ : ఈ నెల 5 నుంచి మరో వారం రోజుల పాటు మూడవ విడతలో ఎన్నికల బాండ్ల జారీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికలు జరిగే సంవత్సరాల్లో బాండ్ల కోసం అదనంగా పక్షం రోజులు కేటాయించేందుకు వీలుగా ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రభుత్వం గత నెలలో సవరించింది. ఈ నేపథ్యంలో తాజా ఆదేశాలు వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా 29 ఎస్‌బిఐ శాఖల ద్వారా 24వ విడత ఎన్నికల బాండ్ల జారీని ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. డిసెంబరు 5 నుంచి 12 వరకు ఈ బాండ్లను జారీ చేయడం, నగదు చేసుకోవడం ఈ శాఖల ద్వారా చేయవచ్చు. ఒరిజినల్ పథకం ప్రకారం అక్టోబరులో పదిరోజుల పాటు బాండ్ల అమ్మకాలు జరిగాయి. ఆ తర్వాత సవరించిన నిబంధనల మేరకు గుజరాత్, హిమాచల్ ఎన్నికల ముందు నవంబరు 9నుంచి వారం పాటు సాగాయి. ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల నుంచి భారీ మొత్తంలో బిజెపికి ఎన్నికల విరాళాలు సమకూర్చుకుంటోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

భారత నేవీలోకి 341 మంది మహిళలు

న్యూఢిల్లీ : భారత నావికా దళంలో తొలిసారిగా మహిళా నావికులను చేర్చినట్లు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్. హరికుమార్ తెలిపారు. ఈ నెల 4న నేవీ డే సందర్భంగా శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. అగ్నివీర్ పథకం కింద సుమారు 3,000 మందిని నౌకాదళంలోకి తీసుకున్నామని అన్నారు. వీరిలో 341 మంది మహిళలు ఉన్నారని.. మహిళలను నావికాదళంలోకి తీసుకోవడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌పై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చిందని, 2047 నాటికి నావికాదళం ఆత్మనిర్భర్‌గా మారుతుందని హామీ ఇచ్చామని తెలిపారు. తేలికపాటి విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను ప్రారంభించడం దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిందని అన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా సైనిక, పరిశోధనా నౌకల కదలికలపై నావికాదళం గట్టి నిఘా ఉంచిందని చెప్పారు. గత ఏడాది కాలంలో భారత నావికా దళం అత్యధిక కార్యాచరణను సాధించిందని, సముద్ర భద్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చిందని అన్నారు.



తిరుమలైకుమార్‌కు 'శ్రేష్ఠ దివ్యాంగజన్‌' అవార్డు

- రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'శ్రేష్ఠ దివ్యాంగజన్‌' జాతీయ అవార్డుకు విజయవాడ రైల్వే డివిజన్‌ ఉద్యోగి సుబ్బయ్య తిరుమలైకుమార్‌ ఎంపికయ్యారు. సామాజికన్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌ భవన్‌లో శనివారం జరిగిన అవార్డుల బహూకరణ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. స్పోర్ట్స్‌ విభాగంలో వ్యక్తిగత ప్రతిభకు ఈ అవార్డును అందుకున్నారు. సుబ్బయ్య తిరుమలైకుమార్‌ విజయవాడ డివిజన్‌ కమర్షియల్‌ విభాగంలో బుకింగ్‌ సూపర్‌ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డును సుబ్బయ్య తిరుమలై కుమార్‌ గెలుచుకోవడం ద్వారా డివిజన్‌ గర్వించేలా చేశారని విజయవాడ డివిజనల్‌ రైల్వే మేనేజరు శివేంద్రమోహన్‌ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్‌, వి.రాంబాబు, సీనియర్‌ డిసిఎం వల్లేశ్వర బి తోకల తిరుమలైకుమార్‌ను అభినందించారు.

ఎల్‌టి పోస్టుల దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖలో సీనియర్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌, ల్యాబ్‌ టెక్నీషియన్‌ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు, నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ డైరెక్టర్‌ జె.నివాస్‌ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో ఈ భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల రెండు నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తు ప్రొఫార్మా అందుబాటులో ఉంటుందని, 12లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. ఖాళీల వివరాలు, అర్హతలు, పోస్టులకు కావాల్సిన అనుభవం, నియామక విధానానికి సంబంధించిన వివరాలు www.cfw.ap.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో ఉన్న దరకాస్తులను ఇతర ప్రొఫార్మాలో పంపించినట్లయితే వాటిని పరిగణలోకి తీసుకోబోమని నివాస్‌ తెలిపారు.

పిసిసి అధ్యక్షునిగా 9న రుద్రరాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పిసిసి అధ్యక్షునిగా గిడుగు రుద్రరాజుతో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 9న మధ్యాహ్నం 1 గంటకు విజయవాడ భవానీపురం ఎన్‌ కన్వెన్షన్‌లో ఉంటుందని పిసిసి వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ షేక్‌ మస్తాన్‌వలి పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు.

బిజెపి హయాంలో ఉపాధి కరువు

- కేంద్రం మద్దతుతో దేశంలో పెరుగుతున్న సంపన్న వర్గం
- 'నిరుద్యోగం - ప్రభుత్వ విధానాలు - కర్తవ్యాలు' సదస్సులో ప్రొఫెసర్‌ పురేంద్ర ప్రసాద్‌

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

బిజెపి హయాంలో దేశ వ్యాప్తంగా ఉపాధి కరువైందని, ఉన్న ఉద్యోగాలకు భద్రతలేదని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్‌ పురేంద్రప్రసాద్‌ అన్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతుతోనే దేశంలో సంపన్న వర్గం నానాటికీ కోట్లాది రూపాయలుగా పడగలెత్తుతోందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం 'నిరుద్యోగం - ప్రభుత్వ విధానాలు - కర్తవ్యాలు' అన్న అంశంపై విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సిఐటియు, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో కామ్రేడ్‌ నందూరి ప్రసాదరావు స్మారకోపన్యాసం పేరిట ఈ కార్యక్రమం జరిగింది. సదస్సుకు ముఖ్య వక్తగా పురేంద్ర ప్రసాద్‌ హాజరై మాట్లాడారు. దేశంలో నేడు పట్టణాల్లో ఎక్కువగా డెలివరీ బాయ్‌లు, మార్కెటింగ్‌ ఉద్యోగాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పల్లెల్లో గొర్రెల పెంపకం, నిర్మాణ రంగ పనులు, బీడీల తయారీ, మహిళలను వస్త్ర పరిశ్రమల్లోకి పనికి పంపడం ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. కోవిడ్‌ సమయంలో ప్రజలు అన్ని విధాలా నష్టపోయినప్పటికీ దేశంలో బిలియనీర్ల సంఖ్య మాత్రం పెరిగిందన్నారు. ముఖ్యంగా ప్రయివేటు ఫార్మా కంపెనీలు ఎంతో లాభపడ్డాయని, వాటికి విచ్చలవిడిగా వ్యాపారం చేసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయపడిందని తెలిపారు. వ్యాక్సిన్‌, మందుల తయారీని ప్రయివేటుకే అప్పగించారన్నారు. ప్రభుత్వ సంస్థలను గాలికొదిలేసి ప్రయివేటు సంస్థలకు సహకరిస్తూ ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఆర్థిక విధానాలు, పెట్టుబడిదారీ పద్ధతుల మూలంగా రోజుకు వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని చెప్పారు. 'జాబ్‌ లెస్‌ గ్రోత్‌' దేశంలో ఉందని తెలిపారు. ఏ రాజకీయ పార్టీలు ఏ వర్గ ప్రయోజనం కోసం పనిచేస్తున్నాయో యువత తెలుసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఉపాధి హక్కును పోరాడి సాధించుకోవాలని కోరారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్‌.నర్సింగరావు మాట్లాడుతూ దేశానికి వెన్నెముక వంటి ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రభుత్వాలు కారుచౌకగా ప్రయివేటుకు అప్పగిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాలన్నింటినీ కాంట్రాక్టుపరం చేసి ఉద్యోగ భద్రత లేని సమాజాన్ని తీసుకొస్తున్నాయన్నారు. ఈ విధానాలు యువతకు ఎంతో ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, కె.ప్రసన్న కుమార్‌ మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే కార్పొరేటీకరణ విధానాలను ఎదుర్కోగలమని, చదువుకు తగ్గ ఉద్యోగాలు పొందగలమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌, పిడిఎఫ్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ పురేంద్ర ప్రసాద్‌, వేదికపై సిహెచ్‌.నర్సింగరావు తదితరులు



వికాస్‌ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఐద్వా, కెవిపిఎస్‌ నాయకులు

కులదురహంకార హత్యకు పాల్పడిన వారిని శిక్షించాలి : ఐద్వా, కెవిపిఎస్‌

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : కుల దురహంకార హత్యకు మోహనకృష్ణ తల్లిదండ్రులు పాల్పడి ఉంటే వెంటనే వారిని శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, కెవిపిఎస్‌ జిల్లా అధ్యక్షులు మునిరామయ్య డిమాండ్‌ చేశారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లిలోని వికాస్‌ కుటుంబాన్ని ఐద్వా, కెవిపిఎస్‌ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వికాస్‌ కుటుంబీకులు మాట్లాడుతూ మోహనకృష్ణ, వికాస్‌ ఐదేళ్లుగా ప్రేమించుకున్నారని, కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదని తెలిపారు. ఈ కారణంగా పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకోవాలని వెళ్లిపోయారని, వారిని తీసుకొచ్చి పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్‌ ఇచ్చారని తెలిపారు. అమ్మాయి అంగీకారంతోనే తల్లిదండ్రులతో పంపించారని, రెండు రోజుల తరువాత కడుపునొప్పి తాళలేక చనిపోయిందని వార్త వచ్చిందని తెలిపారు. తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యతని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పరువుపేరుతో మనుషుల ప్రాణాలు తీసే సంస్కృతిని ప్రభుత్వం అణచివేయాలన్నారు. కులాంతర, మతాంతర పెళ్లిళ్లు చేసుకున్న వారిని శిక్షిస్తున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వికాస్‌ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. వికాస్‌ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం.జయంతి, కెవిపిఎస్‌ నాయకులు ఉన్నారు.



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్‌ జగన్‌ దంపతులు

పిఎ కుమార్తె వివాహానికి హాజరైన సిఎం

- కడప జిల్లాలో ముగిసిన పర్యటన

ప్రజాశక్తి పులివెందుల టౌన్‌

తన వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్‌ కుమార్తె వివాహానికి సిఎం జగన్‌, ఆయన సతీమణి భారతి హాజరై వధూవరులు హేమలత, గంగాధర్‌ను ఆశీర్వదించారు. అంతకుముందు సిఎం జగన్‌ ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్‌లో భాకారాపురం చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కదిరిరోడ్డులోని ఎస్‌సిఎస్‌ఆర్‌ గార్డెన్స్‌కు వచ్చి వధువరులను ఆశీర్వదించారు. అనంతరం కడప విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్నారు. దీంతో కడప జిల్లాలో ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటన ముగిసింది. కడప ఎయిర్‌పోర్టులో సిఎం జగన్‌కు ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, ఎంపి వైఎస్‌.అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్‌,కలెక్టర్‌ విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్‌, తదితరులు వీడ్కోలు పలికారు.

అమరరాజా వెళ్లడానికి ప్రభుత్వమే కారణం ?

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరరాజా సంస్థ సొంత రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రానికి వెళ్లడానికి రాష్ట్రప్రభుత్వ టెర్రరిజమే కారణమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో పుట్టిన సంస్థ తొలిసారి చిత్తూరు వదిలి రాష్ట్రం వెలుపల రూ.9,500 కోట్ల పెట్టుబడి పెడుతోందని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక సంస్థను ప్రోత్సహించాల్సింది పోయి గతంలో ఇచ్చిన భూములు కూడా వెనక్కి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు, తనిఖీల పేరుతో నిత్యం ఇబ్బంది పెట్టారని విమర్శించారు. నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు లక్ష కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన ఒక బిలియన్‌ డాలర్‌ సంస్థ అమరరాజా అని పేర్కొన్నారు. ఉపాధినిచ్చే పరిశ్రమకు విద్యుత్‌ సరఫరా నిలిపివేసి తమ శాడిజం చాటుకున్నారని విమర్శించారు. కోర్టు తప్పుపట్టినా తమ వైఖరి మార్చుకోలేదని మండిపడ్డారు. రాజకీయ కక్షలతో ప్రజల ప్రయోజనాలనే కాదని, రాష్ట్ర ప్రతిష్టనే ఫణంగా పెట్టారని విమర్శించారు. రాష్ట్రానికి ఈ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ప్రజలు, చరిత్ర క్షమించవని పేర్కొన్నారు.

తీరభద్రత లక్ష్యంగా నేవీ

- పురోగామి దశలో ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ల ఆర్డర్‌ కాంట్రాక్టు
- తూర్పునౌకాదళం వైస్‌ అడ్మిరల్‌ విశ్వజిత్‌ దాస్‌ గుప్తా

ప్రజాశక్తి - గ్రేటర్‌ విశాఖ బ్యూరో

భారత నావికాదళం రక్షణ అవసరాల నిమిత్తం విశాఖపట్నం హిందుస్థాన్‌ షిప్‌యార్డు (హెచ్‌ఎస్‌ఎల్‌)తో 5 ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ (ఎఫ్‌ఎస్‌ఎస్‌)ల నిర్మాణ ఆర్డర్‌ కాంట్రాక్టు పురోగామి దశలో ఉందని తూర్పు నౌకాదళం వైస్‌ అడ్మిరల్‌ విశ్వజిత్‌ దాస్‌ గుప్తా వెల్లడించారు. విశాఖలోని ఈస్టర్న్‌ ఫ్లీట్‌లో జలాశ్వ నౌకలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆదివారం విశాఖలో జరిగే నేవీ డే వేడుకకు ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతారన్నారు. భారత నౌకాదళాధిపతి అనిల్‌ చౌహాన్‌ ఈ వేడుకకు సారథ్యం వహించనున్నట్టు తెలిపారు. ఫ్లీట్‌ సపోర్టు షిప్‌ల అనుమతులపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. దేశ వ్యాప్తంగా ఇటీవల అగ్నిపథ్‌లో మొదటి బ్యాచ్‌లో తూర్పునౌకాదళంలో 3474 మందిని ఎంపిక చేశామని, వీరిలో 340 మంది మహిళలు ఉన్నారని తెలిపారు.

ఇండియన్‌ నేవీ కేవలం సబ్‌మెరైన్‌ల సేవలే కాకుండా మానవ రహిత పరికరాల టెక్నాలజీపైనా దృష్టి సారించిందన్నారు. న్యూక్లియర్‌ సబ్‌మెరైన్‌ అరిహంత్‌ ఇప్పటికే నేవీ సేవల్లో ఉందని, ఐఎన్‌ఎస్‌ విక్రాంత్‌ కొచ్చిలో ప్రస్తుతం ఉండగా రెండేళ్ల తర్వాత తూర్పు నౌకాదళంలోకి పూర్తిగా రానుందని తెలిపారు. ఆత్మనిర్బర్‌ భారత్‌లో భాగంగా దేశంలోని ప్రభుత్వ షిప్‌యార్డులలో 38 నౌకలు తయారవుతున్నాయని చెప్పారు. దక్షిణ శ్రీలంకలో చైనా నేవల్‌ బేస్‌ను ఏర్పాటు చేసుకున్న విషయంపై ఆయన స్పందిస్తూ... ప్రపంచంలోని చాలా దేశాల్లో చైనా నేవల్‌ బేస్‌లను ఏర్పాటు చేసుకుంటోందని, వాణిజ్యం కోసం మాత్రమే అలా చేస్తోందని తెలిపారు. భవిష్యత్‌లో మనదేశానికి ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తిప్పికొట్టేందుకు ఇండియన్‌ నేవీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విశాఖ జిల్లా రాంబిల్లిలో నేవల్‌ బేస్‌ నిర్మాణ పనుల్లో సాంకేతిక సమస్యలున్నాయని, రెండేళ్లలో వీటిని పరిష్కరించుకుని ముందుకెళ్తామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం క్లియరెన్స్‌ ఇచ్చిందని తెలిపారు. తాము తీర భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. నేవీ డే వేడుకల్లో రాష్ట్రపతితో పాటు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌, ఏపి గవర్నర్‌ విశ్వభూషణ్‌ హరిచందన్‌ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న తూర్పునౌకాదళం వైస్‌ అడ్మిరల్‌ విశ్వజిత్‌ దాస్‌ గుప్తా

600 మంది ఒయో ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ: హోటల్‌ సర్వీస్‌ అందించే ఒయో కంపెనీ దాదాపు 600 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు శనివారం వెల్లడించింది. అంటే.. ప్రస్తుతం ఉన్న 3,700 మందిలో 10 శాతం మంది ఇంటిదారి పట్టనున్నారు. అంతేకాదు సేల్స్‌ విభాగంలో 250 మంది కొత్తవాళ్లను తీసుకుంటామని కంపెనీ తెలిపింది. వీళ్లకు వ్యాపార వృద్ధి, అనుబంధాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనుంది. కంపెనీని లాభాల బాట పట్టించేందుకు, నిర్వహణ వ్యయం తగ్గించుకునేందుకు ఒయో ఈమధ్య భారీ మార్పులు చేపట్టింది. ఆ క్రమంలోనే ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రొడక్ట్‌, ఇంజనీర్ల మీద ప్రభావం పడనుంది. ఒయో స్టార్టప్‌ను రితేశ్‌ అగర్వాల్‌ 2012లో ప్రారంభించాడు. ఒయో రూమ్స్‌ను హోటల్స్‌, హోమ్‌ అని కూడా పిలుస్తారు. హోటళ్లను లీజుకు లేదా ఫ్రాంఛైజ్‌కు ఇస్తుంది. ఒయో అధికారులు మొదట్లో బడ్జెట్‌ హోటళ్లకే ప్రాధాన్యం ఇచ్చేవాళ్లు. 2020 నాటికి 80 దేశాల్లోని 800 పట్టణాలకు ఒయో కంపెనీ విస్తరించింది. ప్రస్తుతం ఒయో చేతిలో 10 లక్షలకు పైగా రూమ్స్‌ ఉన్నాయి.

వాట్సాప్‌లో ఎల్‌ఐసి సేవలు.. ఎలా పొందాలి?

హైదరాబాద్‌: జీవిత బీమా రంగ దిగ్గజం భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసి) పాలసీదారులకు మరింత సులభంగా సేవలను అందించనుంది. దీనికోసం వాట్సాప్‌లో కొత్త నంబరును ప్రారంభించింది. 'పాలసీ దారులు 8976862090 నంబరుకు 'హాయ్‌' అని సందేశం పంపిస్తే చాలు. మొత్తం 10 రకాల సేవలను అందుబాటులోకి వస్తాయ'ని ఎల్‌ఐసి ఛైర్మన్‌ ఎం.ఆర్‌.కుమార్‌ తెలిపారు. వాట్సాప్‌ ద్వారా ప్రీమియం బకాయి, బోనస్‌ సమాచారం, పాలసీ స్థితి, పాలసీపై రుణం ఎంత వస్తుంది?, రుణం తిరిగి చెల్లింపు, రుణంపై వడ్డీ, ప్రీమియం చెల్లింపు సర్టిఫికెట్‌, యులిప్‌- యూనిట్ల స్టేట్‌మెంట్‌, ఎల్‌ఐసీ సేవలకు సంబంధించిన లింకులు, ఆప్ట్‌ ఇన్‌/ఆప్ట్‌ ఔట్‌ సేవలను పొందేందుకు వీలుందని పేర్కొన్నారు. ముందుగా పాలసీ వివరాలను ఎల్‌ఐసి పోర్టల్‌లో నమోదు చేసుకొన్న వారు, తమ అధీకృత మొబైల్‌ నంబరు నుంచి ఈ సేవలను పొందవచ్చు.



ధర్నాలో మాట్లాడుతున్న ఆవాజ్‌ నేతలు

స్కాలర్‌షిప్‌ కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్‌

మైనార్టీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లను కొనసాగించాలని డిమాండ్‌ చేస్తూ కర్నూలు కలెక్టరేట్‌ ఎదుట ఆవాజ్‌ ఆధ్వర్యంలో ముస్లిములు శనివారం ధర్నా చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ముస్లింల పట్ల అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అవాజ్‌ నగర కార్యదర్శి పి.ఇక్బాల్‌ హుస్సేన్‌, నగర నాయకులు మహమ్మద్‌ షరీఫ్‌ మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులు, మైనార్టీలను అణచివేయాలని చూస్తోందన్నారు. హిందువులు, దళితుల మధ్య తగాదాలు పెట్టి రాజకీయ చదరంగం ఆడుతోందని విమర్శించారు. రాజేందర్‌ సచార్‌, రంగనాథ్‌ మిశ్రా కమిషన్ల సిఫారసుల మేరకు స్కాలర్‌షిప్‌లను గత యుపిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుండి ఇస్తోందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఇవ్వలేమంటూ జిఒ ఇవ్వడం దారుణమన్నారు. దళిత, మైనార్టీల పట్ల బిజెపి నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. దీన్ని ప్రజాతంత్రవాదులు, లౌకిక శక్తులు ఖండించాలని కోరారు.

కార్పొరేట్లకు పెద్ద ఎత్తున రాయితీలను ప్రకటిస్తున్న మోడీ ప్రభుత్వం ముస్లిముల పట్ల వివక్షత చూపడం తగదన్నారు. ప్రీ మెట్రిక్స్‌ స్కాలర్‌షిప్‌లను యధావిధిగా అమలు చేయాలని వారు డిమాండ్‌ చేశారు. ధర్నాకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాదర్శి అబ్దుల్లా ప్రసంగించారు. ధర్నాలో ఆవాజ్‌ నేతలు ఇలియాజ్‌, అయూబ్‌, ఫైరోజ్‌, షాలిబాషా, ఖాజా బాషా, ఇలియాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

బాడీ షేమింగ్

మనిషి వైజ్ఞానికంగా పెరిగి, మనోవైజ్ఞానికంగా తరిగిపోతున్నాడా...అనిపిస్తుంటుంది. 'ప్రతిది సులభ సాధ్యమ్ము కాదు సుమ్మి/ నరుడు నరుడౌట ఎంత దుష్కరమ్ము' అంటాడు కవి గాలిబ్. మనిషి తనం, మానవత్వం మంటగలిసిపోతోంది. మనిషి ఎంత విజ్ఞానం సాధించినా సమానత్వం విషయంలో సంకుచితంగానే వ్యవహరిస్తున్నాడు. 'మెదడే పెరిగి హృదయం తరిగి/ నరుడే ఈనాడు వానరుడైనాడు' అంటాడు దాశరథి. ముఖ్యంగా మహిళల విషయంలో ఈ సంకుచిత ధోరణి పరాకాష్టకు చేరుతోంది. మహిళలను వేధించడం, లైంగికదాడి, అవహేళన నిత్యకృత్యమైంది. పితృస్వామ్య భావజాలం నిండిన సమాజంలో అమ్మ, అక్క, చెల్లి, భార్య... ఇలా ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఏదో ఒక సందర్భంలో ఈ హింసను అనుభవించినవారే ఎక్కువ. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగినా... వారి పట్ల అసహనం, హింస వంటివి అన్నిచోట్లా కనిపిస్తూనే ఉన్నాయి. వికృతమైన చూపులు, వ్యంగ్యపు మాటలు అనేక రూపాల్లో వ్యక్తమౌతుంటాయి. స్త్రీ అణచివేత ఒక నిశ్శబ్ద ఉద్యమంగా సాగే విధానం ఒకటి ఈ సమాజంలో అంతర్లీనంగా ప్రవహిస్తున్నది. దాని విభిన్న రూపాల్లోని ఒక పార్శ్వం బాడీ షేమింగ్. అవయవాల పేరుతోనో, సన్నగా వున్నారనో, లావుగా వున్నారనో, రంగు పేరుతోనో ఒక మనిషి మరో మనిషిని గేలి చేయడం... మానవత్వానికి, మనిషితనానికి మాయని మచ్చ.

స్త్రీ అంటే...శరీరాన్ని మాత్రమే చూసే పితృస్వామ్య సంస్కృతిని, మనువాద భావజాలాన్ని పెంచిపోషిస్తున్న ప్రభుత్వాలు ఒకవైపు, అదే శరీరాన్ని వస్తువుగా మార్చే కార్పొరేట్ సంస్కృతి మరోవైపు ఆడపిల్లలపై హింసను ప్రేరేపిస్తున్నాయి. ఏసీ గదిలో కూర్చున్నా ఉక్కపోసినట్లు... నలుగురి మధ్యలోవున్నా అభద్రత...న్యూనతాభావం తప్పడంలేదు. 'అర్ధరాత్రి ఒంటరిగా స్త్రీ తిరగగలిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం' అన్నాడు గాంధీజీ. కానీ, పట్టపగలు కూడా తిరిగే పరిస్థితి లేదు. లైంగిక దాడులతో పాటు బాడీ షేమింగ్‌ను కూడా ఎదుర్కోవాల్సిన పరిస్థితి. రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవిలో వున్నవారిపై సైతం అనుచిత వ్యాఖ్యలు వెలువడ్డాయి. తాజాగా రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలు ఉన్మాదానికి పరాకాష్ట. ప్రవచనాల పేరుతో మహిళలను అవమానించే గరికపాటి వంటి వారికీ కొదవ లేదు. 'సోషల్ మీడియాలో నా బరువు గురించి చాలామంది ట్రోల్స్ చేశారు. ఇక నా పెళ్లికి వచ్చిన వారు కూడా నేను లావుగా ఉన్నానని మాట్లాడుకోవడం నేను విన్నాను' అంటూ ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఓ నటి కన్నీటిపర్యంతమైన విషయం కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యింది. భర్త చనిపోతే...విధవ అని ముద్ర వేసి, అరిష్టం, అశుభం, అనర్థం అంటూ అవమానించే అనాగరిక చర్య ఇంకా కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురు స్త్రీలలో ఒకరు శారీరకంగా, లైంగికంగా, మానసికంగా ఏదో ఒక రూపంలో హింసను అనుభవిస్తున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా లైంగిక హింస పెరిగిందని ఐరాస చెబుతోంది.

'నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించు' అనేది ఒక సూక్తి. మనిషి ఎంత కురూపి అయినా తనను తాను ప్రేమించుకుంటాడు. తన సౌందర్యానికి తానే మురిసిపోతాడు. ఎవరి ఆనందం వారిది. కానీ, ఇతరులను తక్కువచేసి మాట్లాడే హక్కు మాత్రం లేదు. ప్రతి వ్యక్తికీ భావవ్యక్తీకరణ స్వేచ్ఛ వుంది. పుట్టుకతోనే అంగవైకల్యంతో పుట్టినవారు, తడబడుతూ మాట్లాడేవారు...రకరకాల శారీరక, మానసిక సమస్యలున్న వారికి సైతం ఈ సమాజంలో గౌరవంగా జీవించే హక్కు వుంది. తోటి మనిషిని మనిషిగా గౌరవించాలి. నల్లగా వున్నారనో, స్థూలకాయులనో, అంగవికలురనో, వితంతువులనో హేళన చేయడమంటే...వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే అవుతుంది. దీనికితోడు బాబాలు, ప్రవచనకారులు, సంఘపరివార్ శక్తులు...మహిళల శరీరంపైనా, వారి వస్త్రధారణపైనా విషం చిమ్ముతున్నారు. 'ఇక సాగదు ఈ నేలపై దురాచారం/ ఆశలన్నీ చిగురించే సమయమిది/ అవకాశాలన్నీ మోసులెత్తే సమయమిది/ కొత్త యుగానికి శుభారంభమిది' అంటారు కవయిత్రి వాసా ప్రభావతి. వేళ్ళు ముదిరి ఇంటి పునాదులకే ప్రమాదం వచ్చినప్పుడు ఆ చెట్టును కొట్టేయాలి. మనిషితనానికి ఓ మనిషే విఘాతంగా మారినప్పుడు ఆ మనిషికి బుద్ధి చెప్పాలి. మనిషిపై మనిషికి నమ్మకం కలిగించాలి. మనిషితనాన్ని బతికించాలి.

మంచి మాట




విప్లవ సాశీల్యాన్ని పుణికి పుచ్చుకున్న వారు కష్టాలకు, కడగండ్లకు, వైఫల్యాలకు వెరవరు. తమ దీక్ష నుంచి వైదొలగరు. వెనుకంజ వేయరు. పార్టీ, విప్లవం, వర్గం, దేశం, తోటి మానవుల ప్రయోజనాల కోసం స్వంత ప్రయోజనాలను త్యాగం చేయడానికి కూడా తటపటాయించరు.

- హోచిమిన్

బాబ్రీ విధ్వంసం - ముప్పయ్యేళ్ల మతతత్త్వ ముప్పు

ప్రస్తుతం



ఇదంతా చేసిన బిజెపి దేశం నెత్తిన కూచుంటే వారలా చేసేందుకు అవకాశమిచ్చిన కాంగ్రెస్ అస్తిత్వం కోసం తంటాలు పడుతున్నది. ఇప్పుడు ఆ మసీదు కూలిన చోట సరికొత్త రామమందిరం వెలసింది. ఏ ఎన్నిక వచ్చినా ప్రధాని మోడీ, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అక్కడ పూజలతోనే ప్రారంభిస్తున్నారు. కానీ డిసెంబరు ఆరు మాత్రం ఘోషిస్తూనే వుంది. అయిదు వందల ఏళ్ల చరిత్రను మలుపు తిప్పిన అవకాశవాద చరిత్ర అనుక్షణం దేశాన్ని హెచ్చరిస్తూనే వుంది. బాబ్రీ విధ్వంసానికేగాక సరళీకరణ అమలుకు కూడా మూడు దశాబ్దాలు కావడం యాదృచ్ఛికం కాదు. ప్రపంచీకరణ పేర ప్రజాప్రయోజనాలు ఫణంగా పెట్టడంలో మతవాదులు ముందుంటారు. ఆ విధానాల విషమ ఫలితాలను విభజన విద్వేషాల వైపు మరలిస్తారు. ఇదో కపట ద్వంద్వ నీతి.

భారతదేశ చరిత్రలో మరచిపోకూడని రాజకీయ దురంతానికి గుర్తు 1992 డిసెంబరు ఆరవ తేదీ. రామ జన్మభూమి/బాబ్రీ మసీదు వివాదాస్పద స్థలంగా పేరొందిన కట్టడాన్ని మతోన్మాద మూకలు నేలమట్టం చేసిన రోజు. భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం లౌకికతత్వం, శాసనబద్ధ పాలన కుప్పకూల్చిన రోజు. అప్పటి నుంచి ఈ మూడు దశాబ్దాలలో జరిగిన పరిణామాలన్నీ కూల్చిన ఆ కట్టడం పునాదులపై సాగుతున్న రాజకీయ విన్యాసాలే. ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వమూ దానికి ముందు పాలన చేసిన వాజ్‌పేయి ప్రభుత్వమూ ఆ శిథిలాలపై లేచిన మతోన్మాద సౌధాలే. వామపక్ష లౌకిక శక్తులు మినహాయిస్తే దేశంలోని అవకాశవాద అధికార దాహపూరిత రాజకీయ రాజ్యాంగ న్యాయ వ్యవస్థలు దీన్ని అనుమతించి కొనసాగనిచ్చాయి. ఇదంతా చేసిన బిజెపి దేశం నెత్తిన కూచుంటే వారలా చేసేందుకు అవకాశమిచ్చిన కాంగ్రెస్ అస్తిత్వం కోసం తంటాలు పడుతున్నది. ఇప్పుడు ఆ మసీదు కూలిన చోట సరికొత్త రామ మందిరం వెలసింది. ఏ ఎన్నిక వచ్చినా ప్రధాని మోడీ, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అక్కడ పూజలతోనే ప్రారంభిస్తున్నారు. కానీ డిసెంబరు ఆరు మాత్రం ఘోషిస్తూనే వుంది. అయిదు వందల ఏళ్ల చరిత్రను మలుపు తిప్పిన అవకాశవాద చరిత్ర అనుక్షణం దేశాన్ని హెచ్చరిస్తూనే వుంది. బాబ్రీ విధ్వంసానికేగాక సరళీకరణ అమలుకు కూడా మూడు దశాబ్దాలు కావడం యాదృచ్ఛికం కాదు. ప్రపంచీకరణపేర ప్రజాప్రయోజనాలను ఫణంగా పెట్టడంలో మతవాదులు ముందుంటారు. ఆ విధానాల విషమ ఫలితాలను విభజన విద్వేషాల వైపు మరలిస్తారు. ఇదో కపట ద్వంద్వ నీతి.



తెలకపల్లి రవి

రాముడి పేర రాజకీయం

అయోధ్య అంటే యుద్ధం లేనిది అని అర్థం. అదే పెద్ద రణ రంగ స్థలిగా మారిపోవడం రాజకీయ క్రీడల ఫలితమే. గతంలో తెల్లజాతి పాలకులూ తర్వాత ఆరెస్సెస్, బిజెపి కూడా ఈ సమస్యను విభజన రాజకీయాలకు సాధనంగానే చేసుకోవడం వాస్తవం. హిందూ మత గ్రంథాలు గాని, బాబర్ పాలించిన నాడు భారత దేశం సందర్శించిన యాత్రీకుల కథనాలు గాని, ఆయన స్వంత జ్ఞాపకాలలో గాని అక్కడ మందిరాన్ని పడగొట్టిన ఊసు లేదు. నాటి పురాణాల్లో అయోధ్యకు అంత ప్రాధాన్యత ఇచ్చిందీ లేదు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనబడే 1857 వరకూ అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సంబంధించి ఎలాంటి సమస్యా లేదు. ఉన్న స్వల్ప వివాదాలు పెరిగిందీ లేదు. తర్వాత బ్రిటిష్ అధికారులు వ్యూహాత్మకంగా ఈ చిచ్చు రాజేశారు. 1855 వరకూ అక్కడ హిందూ ముస్లింలు కలిసే పూజలు చేసుకుంటుండేవారు. 1886లో కూడా మసీదు ద్వారం వెలుపల వున్న చబూత్రా వున్న చోటనే రాముడు జన్మించాడంటూ కోర్టులో వ్యాజ్యం నడిచింది. ఆ వ్యాజ్యాన్ని ఆనాడే కోర్టు తోసిపుచ్చింది. కనక బాబ్రీ మసీదు వున్న చోటనే రాముడు జన్మించాడంటూ దాన్ని పడగొట్టి గుడి కడితేనే రామభక్తి అవుతుందని చెప్పడం ప్రతీకార రాజకీయాల పర్యవసానమే. అయోధ్యలో పదికి పైగా రామాలయాలుంటే ప్రతి చోటా రాముడి జన్మస్థానమనే చెబుతుంటారు. కౌసల్యా మందిరం కూడా వుంది గనక ఆయన జననం అక్కడే జరిగిందని కూడా భావించే అవకాశం వుంది. ఇంతా చేసి రాముడు పూజలందుకునే పురాణ పురుషుడే గాని చారిత్రిక కోణాలతో తేల్చదగిన రాజు కాదు. అలాగాక పురాణాలలో లెక్కల ప్రకారం త్రేతాయుగం అను కుంటూ ఎనిమిది లక్షల ఏళ్ల కిందటి కాలానికి వెళ్లాలి. అప్పుడు ఈ భూమండలం ఏ రూపంలో వుందో కూడా తెలియదు. కనక మౌలికంగా భక్తి విశ్వాసాలకు సంబంధించిన ఈ సమస్యను చరిత్రతో రాజకీయాలతో ముడివేయడమే పెద్ద వ్యూహం. 1949లో చీకటిరాత్రి రహస్యంగా రామ లక్ష్మణుల విగ్రహాలను ఆ ఆవరణలో ప్రతిష్టించిన తర్వాత కూడా నాటి ప్రధాని నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సరిగ్గానే స్పందించారు. అది ఎలాంటి ఉద్రిక్తతలకు దారి తీయకుండా తాళాలు వేయించారు. అప్పటి నుంచి వివా దం కొత్త మలుపులు తిరుగుతూ ఎనభైలలో బిజెపి మత రాజకీయాలతో పాటు మరింత తీవ్రమవుతూ వచ్చింది. 2010లో బిజెపికి అనుకూలంగా తీర్పునిచ్చిన లక్నో హైకోర్టు కూడా విగ్రహాలను అక్రమంగా అక్కడకు చేర్చారనే వ్యాఖ్యానించింది.

అవకాశవాద రాజకీయాలు

1986లో బిజెపి పాలంపూర్‌లో అయోధ్య సమస్యను కీలకమైందిగా చేపట్టిన తర్వాతే సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. శిలాన్యాస్‌లు, రథయాత్రలూ దాన్ని మరింత వేడెక్కించాయి. రాజగురువుల్లా సాధుసంతులను ముందు పెట్టుకుని రాజకీయ ప్రహసనం నడిచింది. ఇంతటి ఉద్రిక్తత నేపథ్యంలో రాజీవ్‌గాంధీ ఫైజాబాద్ (అయోధ్య) మేజిస్ట్రేట్ ఇచ్చిన అరకొర తీర్పును ఆధారం చేసుకుని ఆఘమేఘాల మీద వివాదాస్పద కట్టడం తలుపులు తెరిపించారు (షాబానూ కేసులో ముస్లిం మత ఛాందసులను సంతృప్తి పరచిన దానికి విరుగుడుగా హిందూ ఛాందసులను సంతృప్తి పరచేందుకు ఇదొక ఎత్తుగడగా భావించారు). అందుకే 1989లో రాజీవ్‌గాంధీ ఎన్నికల ప్రచారం కూడా రామరాజ్యం నినాదంతో అయోధ్య నుంచే ప్రారంభించాడు. ఈ రాజకీయాలు ఆయన కన్నా బిజెపికే ఎక్కువ మేలు చేయడంతో బిజెపి బలం రెండు సీట్ల నుంచి దాదాపు 90కి చేరింది. అయినా వామపక్షాల కారణంగా బిజెపి అధికారానికి దూరంగా వుండి వి.పి.సింగ్ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బయిట నుంచే బలపర్చవలసి వచ్చింది. ఆ పరిస్థితి తట్టుకోలేక ఆపైన మండల్ సిఫార్సుల అమలును ఆమోదించలేక బిజెపి నేత అద్వానీ రామ రథయాత్ర రాజకీయ దావానలం రగిలించారు. అత్యాధునికమైన టయోటా కారులో గుజరాత్ లోనే మొదలైన ఆ రథయాత్ర నిర్వహణ తొలి బాధ్యత మోడీ చేపట్టారు. రాముడిని దేవుడి స్థాయి నుంచి తమ పార్టీ రాజకీయ చిహ్నంతో పాటు రథంపై చిత్రించుకుని ఉత్తరాది రాష్ట్రాలలో దారుణమైన మత కలహాలకు కారణమైనాడు. స్వతంత్ర భారత రాజకీయ చరిత్రలోనే ఒక ప్రముఖ జాతీయ నాయకుడు మతపరమైన వివాదాన్ని విస్తృత ప్రచారానికి వాడుకోవడం అది మొదటి సారి. చివరకు ఆయనను అరెస్టు చేయగానే కాంగ్రెస్‌తో కలసి బిజెపి వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూలదోసింది. ఈ ప్రచారంలో హిందీ పత్రికా ప్రపంచం కూడా యథాశక్తి పాత్ర వహించింది. ఇన్ని కారణాల వల్ల 1991 ఎన్నికలలో బిజెపి బలం మరింత పెరిగి 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదును కూలదోసే స్థితి వచ్చింది. నాటి ప్రధాని పి.వి.నరసింహారావుకు దీన్ని నిరోధించేందుకు అన్ని పార్టీలూ కలిపి అధికారం ఇచ్చినా చిటికెన వేలు కదల్చకుండా కూల్చివేతను అనుమతించారు. పదవీ విరమణ తర్వాత దీనిపై బృహద్గ్రంథాలు వెలువరించి మరీ సమర్థించుకోడానికి పాకులాడాడు. అయినా ఆ నాటి కళంకం చెదిరిపోయేది కాదు. అయితే అసలు అపరాధం మాత్రం ఆరెస్సెస్, బిజెపి, సంఘ పరివార్‌దేనన్నది చారిత్రిక సత్యం. దాని వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోవడమే కాక అంతర్జాతీయంగానూ దేశ ప్రయోజనాలకు హాని కలిగింది. మీడియా కూడా దాడులకు గురైంది. మరో పదేళ్లకు 2002లో రగిలిన గుజరాత్ మారణకాండ నరేంద్ర మోడీని దేశాధినేతగా తీసుకొచ్చే పరిస్థితి కల్పించింది.

ముదిరిన మత విద్వేషం

ఈ మూడు దశాబ్దాలను తీసుకుంటే బాబ్రీ మసీదును బూచిగా చూపి పెరగడం తొలి దశ, మలి దశాబ్దంలో గుజరాత్ మారణకాండతో ఫాసిస్టు తరహా రాజకీయాలు తేవడం, 2019 ఎన్నికల ప్రాంగణంలో అయోధ్య తీర్పు సంఘ పరివార్ శక్తులను అనుగుణంగా సుప్రీం కోర్టు తీర్పు రావడం దీనికి పరాకాష్ట. మూడవ దశాబ్దంలో అత్యధిక కాలం వారి రాజ్యమే సాగుతుండడం ఒక చరిత్ర క్రమం. మోడీ హయాంలో అసహన రాజకీయాలూ, రాష్ట్రాల హక్కులపై ప్రత్యక్ష దాడి, రాజ్యాంగ ముసుగు లోనే మత చిహ్నాలను ప్రతిష్టించడడం చూస్తున్న వాస్తవమే. అయోధ్య పహలీ ఝాంకీ హై, కాశీ మథుర బాకీ హై అన్న సంఘ పరివార్ ఇప్పుడు వారణాసి లోని జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే రాజకీయ ఎత్తుగడ అనుసరిస్తున్నది. బాబ్రీ విధ్వంసానికి ముందే పి.వి ప్రభుత్వ హయాంలోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన ప్రార్థనా స్థలాల చట్టం కూడా కొరగాకుండా పోయింది. లక్నో హైకోర్టులో మొదలైన ఆ కేసు సుప్రీం కోర్టు వరకూ వచ్చింది. ఆ చట్టం ప్రకారం అయోధ్య వివాదం సుప్రీం తీర్పు ప్రకారం పరిష్కరించాలని, మిగిలిన అన్ని ఆలయాలలోనూ 1947 ఆగష్టు 15న వున్న యథాతథ స్థితి కొనసాగాలని నిర్దేశించింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలతో సహా చాలా చోట్ల ఆలయాల చుట్టూ రాజకీయ వివాదాలు ముసురుతున్నాయి. ఎ.పి లో మాట్లాడితే తిరుపతి, రామతీర్థం, అంతర్వేది అంటూ ఏకరువు పెడుతున్నారు. తెలంగాణలో బిజెపి...చార్మినార్‌లో కట్టిన భాగ్యలక్ష్మి ఆలయం దగ్గరే సగం రాజకీయం నడిపిస్తున్నది. అయోధ్యలో అక్కరకు వచ్చిన సుప్రీం తీర్పు శబరిమల విషయంలో సహించరానిదైపోయింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాజ్యాంగ పదవిలో వున్న ఉపరాష్ట్రపతి కూడా జడ్జిల నియామక ప్రక్రియపై ప్రత్యక్షంగా దాడి చేయడం న్యాయ వ్యవస్థను లొంగదీసుకునే ప్రయత్నమేనని వేరే చెప్పనక్కరలేదు.

అయోధ్య రామమందిరం గర్భగుడి పని 2023 ఆఖరుకు 15 శాతం పూర్తవుతుందని రామ జన్మభూమి తీర్థక్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్‌రామ్ ప్రకటించారు. మిగిలిన గుడితో కలిపి చూస్తే మొత్తం సగం నిర్మాణం అయిపోయినట్టేనన్నారు. 2023 ఆఖరుకు ఆలయం పూర్తి చేసి 2024 మకర సంక్రాంతి నాడు రాముడి విగ్రహ ప్రతిష్టాపన పూర్తిచేసి భక్తులను అనుమతిస్తామని చెప్పడం రాబోయే ఎన్నికల షెడ్యూలుతో సరిగ్గా సరిపోతుంది. కనుక దేశంలో అయోధ్య పరిణామాల ప్రభావం ఆగిపోయిందనుకుంటే పొరబాటు. దాన్ని ఒక సరికొత్త మతోన్మాద ముప్పు పెరుగుదలకు ఆరంభం లాగానే చూడవలసి వుంటుంది. అయితే వామపక్షేతర పార్టీలలో అనేకం, అలాగే సాధారణ సమాజంలో చాలామంది కూడా మత రాజకీయాలు రాజ్యాంగానికి విరుద్ధమనీ, వ్యక్తిగత స్వేచ్ఛకు కూడా భంగకరంగా మారాయని గుర్తిస్తున్నారా? వ్యక్తుల ఆహార విహారాది విషయల్లోనూ వస్త్రధారణ లోనూ, మహిళలపై మైనార్టీలపై వివక్షలోనూ ఆంక్షలు గుప్పిస్తున్నారు. ఆఖరుకు కరోనా కరాళ వేళలోనూ ఈ మత విద్వేషాలు రగిలించే కుటిలత్వానికి పాలకులు పాల్పడగలిగారు. చాప కింద నీరులా ప్రజల మెదళ్లలో మతతత్వాన్ని జొప్పిస్తున్న ఈ శక్తులే రాజకీయ రంగంలో బాహాటంగానే హిందుత్వను ప్రయోగిస్తున్నారు. అయోధ్య విషయంలో చేసినట్టే ఇప్పుడు దేశ చరిత్రనంతటినీ తిరగరాయాలని మోడీ పిలుపునిస్తున్నారు. అంటే అవాస్తవాలతో కొత్త తరాల బుర్రలు కలుషితం చేయబోతున్నారు. అందుకు అంగీకరించని అధ్యయనశీల మేధావులను, రాజకీయ శక్తులను వేటాడి వేధిస్తున్నారు. రాష్ట్రపతి భవనంలోనూ విందుల్లో మాంసాహారం వుండొద్దని బిజెపి ఎం.పి బిల్లు తెస్తున్నారు. కాషాయాంబరధారులైన దళారులు ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చేందుకు దిగిపోతున్నారు. ఒకప్పుడు రామాయణ్ సీరియల్‌ను ఆరెస్సెస్ వారు ఉపయోగిస్తే ఇప్పుడు భారీ తెరపై తెలుగు బాహుబలి ఆదిపురుషుడుగా అవతరిస్తున్నారు. ఆ అవతారం మోడీజీ మూడో పాదం మోపే ప్రచార సన్నాహంలో భాగమే. జి20 సమావేశం ఇక్కడ ఏర్పాటు చేయడమే గాక మోడీ మా ప్రాణమిత్రుడని అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తున్నాడు. అప్పటి అద్వానీని మించిన అధికార బలంతో ఆధ్యాత్మిక వత్తాసుతో మోడీ సమస్త రంగాలను మతతత్వ పూరితం చేస్తున్నారు. నాడు లౌకిక పార్టీల ఉపేక్ష, పి.వి.నరసింహారావు సర్కారు అవకాశవాదం ఈ పరిస్థితికి కారణమైందని గుర్తుచేసుకుంటే ఇప్పుడు అప్రమత్తత అవసరం తలకెక్కుతుంది. ఏ మాత్రం ఉపేక్షించినా అప్పటి బాబ్రీ మసీదు విధ్వంసాన్ని మించి ఇప్పుడు భారత దేశ మత సామరస్య పునాదులనే పెకిలించే ప్రమాదం విరుచుకు పడుతుంది. అదే డిసెంబరు ఆరు ప్రత్యేక హెచ్చరిక. ★

సత్య

గిరాకీ తగ్గుదల - వనామీ రైతు విలవిల

విశ్లేషణ

మరోవైపు విపరీతంగా పెరుగుతున్న మేత ధరలు అదుపులో ఉండటం లేదు. కనీస మద్దతు ధరను అమలుజరిపే అధికారులు... ఉల్లంఘించిన వారి మీద చర్యలు గానీ ఉండటం లేదు. ఎగుమతి పరిస్థితి మెరుగు పడేంతవరకు పంట విరామం ప్రకటించాలని కూడా కొందరు రైతులు సూచిస్తున్నారు. లక్షలాది మందికి ఆక్వా ఉపాధి కల్పిస్తున్నది. అందువలన ఈ రంగాన్ని కూడా పరిశ్రమగానే గుర్తించి ఇతర పరిశ్రమలకు మాదిరే ఇస్తున్న విద్యుత్, ఇతర రాయితీలను అందరికీ వర్తింప చేయాలని కూడా రైతులు కోరుతున్నారు.



దేశంలో దాదాపు రెండు లక్షల 70 వేల ఎకరాల్లో వనామీ రకం రొయ్యల రకం సాగు జరుగుతోంది. దీనిలో లక్షా 80 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్ లోనే ఉంది. టైగర్ రొయ్యల రకం మరొక లక్షా 50 వేల ఎకరాల్లో జరుగుతోంది. ఇది ప్రధానంగా లక్షా పాతిక వేల ఎకరాలు ఒక్క పశ్చిమ బెంగాలోనే జరుగుతోంది. ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వనామీ రైతులు వాపోతున్నారు. వివిధ కారణాలతో ప్రపంచంలో రొయ్యల ఎగుమతి మార్కెట్ అవకాశాలు తగ్గాయి. ఒక వైపు మేత ధరలు విపరీతంగా పెరగటం, మరొక వైపు కొనే వారు లేక చేతికి వచ్చిన వాటిని తెగనమ్ము కోవాల్సిన పరిస్థితి. రానున్న కొద్ది నెలలు కూడా ఇలాగే కొనసాగితే ఈ రంగం మొత్తం తీవ్ర సంక్షోభంలో పడనుంది. ఒక అంచనా ప్రకారం ఇప్పటికే రూ.25 వేల కోట్ల మేరకు నష్టపోయినట్లు అంచనా. రొయ్యలను శుద్ధి చేసి ఎగుమతికి అనువుగా తయారు చేసే ఫ్యాక్టరీలలో చిన్నా, మధ్యతరగతివి మూసివేతకు దగ్గరగా ఉన్నట్లు చెబుతున్నారు.

ఆగస్టు నెల నుంచి ఎగుమతి డిమాండ్ తగ్గిన కారణంగా ఆంధ్రప్రదేశ్ రొయ్యల మార్కెట్ సంక్షోభం మొదలైంది. విదేశాల్లో డిమాండ్ తగ్గటంతో ధరలు కూడా పడిపోయాయి. 2021-22లో మన దేశం నుంచి 7.76 బిలియన్ డాలర్ల మేర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జరగ్గా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది లక్ష్యంగా 8.6 బి.డాలర్లను నిర్ణయించింది. అది నెరవేరే పరిస్థితి కనిపించటం లేదు. గిరాకీ తగ్గుదల 30 నుంచి 35 శాతం వరకు, ధరల పతనం 20 నుంచి 25 శాతం ఉన్నందున జనవరి తరువాత తిరిగి పూర్వపు స్థాయికి చేరితే తప్ప అటు కేంద్ర ప్రభుత్వానికి విదేశీ మారకద్రవ్యం తగ్గుదల ఇటు రైతాంగానికి ఆర్థిక నష్టం జరుగుతుంది. ఎగుమతి-దిగుమతి దేశాలన్నింటా శీతల గిడ్డంగులన్నీ ఆక్వా ఉత్పత్తులతో నిండి ఉన్నట్లు వార్తలు. ఈ కారణంగానే కొనుగోళ్ల మందగింపు, పరిస్థితి మెరుగుపడక పోదా అనే ఆశ ఉన్న ఎగుమతిదార్లు రైతుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. మెరుగుపడితే మంచి లాభాలు, లేకపోతే నష్టం ఉండదు అన్న అంచనాలే దీనికి కారణం. గతంలో కూడా మార్కెట్లో కొన్ని ఇబ్బందులు తలెత్తినా ఇలాంటి తీవ్రత గడచిన నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేదని ఆ రంగం లోని ప్రముఖులు చెబుతున్నారు.

ధనిక దేశాల్లో తలెత్తిన ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల కారణంగా జనం అత్యవసరమైన వాటినే కొనుగోలు చేస్తారు. ఈ పరిస్థితికి తోడు గతేడాది ప్రపంచంలో 40 లక్షల టన్నుల మేర రొయ్యల ఉత్పత్తి జరిగితే ఈ ఏడాది 50 లక్షల టన్నుల వరకు ఉండవచ్చని అంచనా. ఇది కూడా ధరల పతనానికి ఒక కారణం అంటున్నారు. ఈక్వెడార్, ఇండోనేషియా, వియత్నాంలో ఉత్పత్తి పెరిగింది. చమురు ధరల పెరుగుదలతో రవాణా ఖర్చు పెరిగింది. మన దేశం నుంచి అమెరికా, తరువాత స్థానాల్లో చైనా ఎక్కువగా దిగుమతులు చేసుకుంటున్నాయి. రవాణా ఖర్చుల పెరుగుదల కారణంగా పక్కనే ఉన్న ఈక్వెడార్ నుంచి దిగుమతి చేసుకోవటం అమెరికా లోని దిగుమతి కంపెనీలకు ఎక్కువ లాభం కనుక అక్కడి ఉత్పత్తులకు మొగ్గు చూపుతున్నారు. చైనా కూడా అక్కడి నుంచి కొంత దిగుమతి చేసుకుంటున్నది.

మన కరెన్సీ విలువ తగ్గినందున ఎగుమతిదార్లకు పెరిగిన రవాణా ఖర్చు కలసి వచ్చి కొనుగోలు చేస్తారని భావిస్తే అమెరికా మినహా మిగిలిన దిగుమతి చేసుకొనే దేశాల కరెన్సీ విలువలు కూడా మన రూపాయి మాదిరి పతనమై ఆ దేశాలలో కొనుగోలు శక్తి తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో కిలోకు వంద తూగే వనామీ రకం రొయ్యలకు కనీసం రూ.240 చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరూ కొనుగోలుకు ముందుకు రాకపోవటంతో దాన్ని రూ.210కి తగ్గించినా చిత్తశుద్ధితో అమలు జరిపేవారు లేరు. నిల్వ ఉండే సరకు కానందున చివరకు రూ.180, ఇంకా అంతకు తక్కువకు సైతం అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉత్పత్తి ఖర్చులు కూడా రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ కారణంగా గతేడాది జరిగిన 9.2 లక్షల టన్నుల ఉత్పత్తి ఈ ఏడాది ఎనిమిది లేదా ఇంకా తక్కువకు పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇతర దేశాల రైతులకు సైతం ఎగుమతి అవరోధాలు ఉన్నప్పటికీ మలేషియా, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వంద కౌంట్ ఉన్న వాటికి రూ.290 నుంచి 310 వరకు రైతుకు వస్తుండగా మన దగ్గర రెండు వందల కంటే తక్కువకు దిగజారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కిలోకు రూ.300 లకు తగ్గితే గిట్టుబాటు కాదని, 270 కంటే తగ్గితే నష్టమని అంటున్నారు.

మన దేశం 123 దేశాలకు సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నది. వీటిలో ఎక్కువ భాగం రొయ్యలే ఉండటంతో గతేడాది జరిగిన మొత్తం ఆరులక్షల టన్నుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 60 శాతం వరకు ఉంది. చైనా తన దిగుమతుల్లో 70 శాతం మన దేశం నుంచి చేసుకొనేది ఇప్పుడు ఈక్వెడార్ నుంచి కూడా చేసుకుంటున్నది. వివిధ దేశాలు చేసుకొనే దిగుమతులపై వర్తమాన రాజకీయాలు, వాణిజ్య సంబంధాలు కూడా ప్రభావం చూపుతాయి. మరోవైపున మనదేశంలో బిజెపి, దానికి మార్గదర్శకంగా పనిచేసే సంఘ పరివార్ సంస్థల దళాలు, వారికి వంత పాడే మీడియా విశ్లేషకులు సుప్రభాతం మాదిరి రోజు చైనా ఉత్పత్తులను బహిష్కరించాలని ప్రచారం చేస్తుంటారు. ఇదంతా చూసిన తరువాత మన ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఎగుమతి చేసే దేశాలున్నపుడు వాటి నుంచి దిగుమతుల చేసుకోవాలనే అలోచన కలగవచ్చు. లేకపోతే ఎంతో దూరంలో ఉన్న ఈక్వెడార్ నుంచి చైనా దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చినట్లు? వాటికి ప్రతిగా చైనాకు తన వస్తువులను అక్కడికి ఎగుమతి చేసేందుకు అవకాశాలు పెరుగుతాయి. మన ప్రభుత్వం విధిస్తున్న ఎగుమతి పన్నులు, మన దేశంతో ఒప్పందాలు లేని కారణంగా దిగుమతి చేసే దేశాలు మన ఉత్పత్తులపై విధిస్తున్న పన్నులు కూడా దిగుమతిదార్లను అవి లేని దేశాలవైపుకు నెడతాయి. అందువలన ఇలాంటి పన్నులు లేకుండా ఉండాలంటే మన దేశం ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం కూడా అవసరమే. అయితే అలాంటి ఒప్పందాలకు వెళ్లే ముందు మన దేశ లబ్ధిని కూడా చూసుకోవాల్సి ఉంటుంది. ఐరోపా, ఇతర దేశాలతో వియత్నాం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నందున అవి మనకు బదులు అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటాయి. మన రొయ్యలపై తెల్లమచ్చల కారణంగా ఆస్ట్రేలియా దిగుమతులను నిలిపివేసింది. అందువలన ఎగుమతి చేసే దేశాలు కోరుకున్న ప్రమాణాల మేరకు వ్యాధులు, నిషేధిత మందుల అవశేషాలు లేకుండా మన ఉత్పత్తులుండటం కూడా అవసరమే. ఒక వేళ ఇక్కడ కన్ను గప్పి పంపినా ఎక్కడైనా పట్టుబడితే మొదటికే మోసం వస్తుంది.

స్థానిక సమస్యల సంగతులను చూస్తే నాణ్యమైన రొయ్య విత్తన (పిల్లల) లభ్యత కూడా తీవ్రంగానే ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఎత్తివేసేందుకు దారులు వెతికి రైతుల్లో ఆందోళన కలిగించింది. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అని కొన్ని రోజులు, ఐదెకరాల లోపు, ఆపైవారు అని మరికొన్ని రోజులు, సర్వేల పేరుతో చేస్తున్న కాలయాపన గురించి రైతుల్లో అసంతృప్తి ఉంది. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వలంటీర్లు ఉన్నందున ఒక్క రోజులో సమాచారాన్ని సేకరించవచ్చు. మరోవైపు విపరీతంగా పెరుగుతున్న మేత ధరలు అదుపులో ఉండటం లేదు. కనీస మద్దతు ధరను అమలుజరిపే అధికారులు...ఉల్లంఘించిన వారి మీద చర్యలు గానీ ఉండటం లేదు. ఎగుమతి పరిస్థితి మెరుగుపడేంతవరకు పంటవిరామం ప్రకటించాలని కూడా కొందరు రైతులు సూచిస్తున్నారు. లక్షలాది మందికి ఆక్వా ఉపాధి కల్పిస్తున్నది. అందువలన ఈ రంగాన్ని కూడా పరిశ్రమగానే గుర్తించి ఇతర పరిశ్రమలకు మాదిరే ఇస్తున్న విద్యుత్, ఇతర రాయితీలను అందరికీ వర్తింప చేయాలని కూడా రైతులు కోరుతున్నారు. సంక్షోభ సమయాల్లో అన్ని రంగాలను ఆదుకున్నట్లుగానే ఆక్వాను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వారి గోడును పాలకులు వినిపించుకుంటారా? అనుమానమే! ★

బిజెపి హఠావో.. దేశ్ బచావో...

• డిఎస్ఎంఎం సౌహార్ద సభలో ఏచూరి • ఘనంగా 3వ మహాసభ ప్రారంభం



బెగుసరాయ్ : దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) 3వ అఖిల భారత మహాసభ శనివారం బీహార్‌లోని బెగుసరాయ్‌లో ఘనంగా ప్రారంభమైంది. రాహుల్ సాంకృత్యాయన్ నగర్ సారంగధర్ పాశ్వాన్ మంచ్‌లో మహాసభ ఈ నెల 5 వరకు జరుగుతుంది. డిఎస్ఎంఎం మహాసభకు మద్దతుగా సిపిఎం స్థానిక జికె ఇంటర్ కళాశాల ప్రాంగణంలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ, రామచంద్ర డోమ్ తదితరులు పాల్గొన్నారు. దళిత్ శోషణ్ ముక్తి మంచ్ చేపట్టే ఉద్యమాలకు అండగా నిలుస్తామని ఏచూరి అన్నారు. బిజెపిని తరిమికొడితేనే దేశానికి రక్ష అని ఆయన చెప్పారు. కేంద్రంలోని బిజెపి నేతృత్వ మోడీ ప్రభుత్వ హయాంలో దళితుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్ష, సామాజిక అణిచివేత, కుల, మత, జాతుల ప్రాతిపదికన చీలికలు తీసుకొచ్చి బిజెపి వినాశకర చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. దళిత మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, మోడీ ప్రభుత్వం రేపిస్టులకు, వేధింపులకు పాల్పడే వారికి రక్షకునిగా మారిందని ఏచూరి ఆగ్రహం వ్యక్తంచేశారు. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంతరాలనితను తీవ్రమైన సవాలుగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపిని తరిమికొడితేనే దళితులకు, దేశానికి, బీహార్‌కు రక్ష అని ఆయన అన్నారు. డిఎస్ఎంఎం మహాసభకు ఆంధ్రప్రదేశ్ నుంచి 23 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

బెంగాల్‌లో భారీ పేలుడు : ఇద్దరు మృతి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన పేలుడులో ఇద్దరు చనిపోయారు. పూర్వ మిడ్నాపూర్ జిల్లా భూపతినగర్ ప్రాంతంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పాల్గొనాల్సిన సభకు సమీపంలోని ఇంట్లో జరిగిన ఈ పేలుడు ఘటనలో ఇద్దరు చనిపోయారని, మరికొందరు గాయపడ్డారని పోలీసులు శనివారం తెలిపారు. పేలుడుకు కారణాలేమిటనేది దర్యాప్తులో తేలాల్సివుందని పేర్కొన్నారు. బెంగాల్‌లో తరుచూ ఇలాంటి పేలుళ్లు చోటుచేసుకుంటున్నా సిఎం, టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ మౌనంగా ఉండిపోవడానికి కారణమేమిటని సిపిఎం రాష్ట్ర నాయకులు సుజన్ చక్రవర్తి ప్రశ్నించారు. ఈ ఘటనపై సిఎం ఇప్పటికైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎయిమ్స్‌పై సైబర్ దాడిపై దర్యాప్తులో సాయపడండి

• ఇ అండ్ వై నిపుణులను కోరిన దర్యాప్తు అధికారులు

న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని ఎయిమ్స్‌లో గత నెల 23న జరిగిన సైబర్ దాడి విషయంలో భద్రతా సంస్థలు ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఇఅండ్‌వై) కన్సల్టెన్సీ సంస్థ సాయాన్ని కోరాయి. ఈ సైబర్ దాడితో ఆస్పత్రిలోని సర్వర్లు, ఇ-ఆస్పత్రి సేవలు స్తంభించిపోయాయి. దీంతో రోగులకు తీవ్రంగా ఇబ్బంది కలిగింది. ఈ ఏడాది మధ్య భాగంలో తమ ఆస్పత్రి సైబర్ వ్యవస్థలపై ఆడిట్ నిర్వహించాల్సిందిగా థర్డ్ పార్టీ ఇ అండ్ వై సంస్థను ఎయిమ్స్ కోరిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వ్యవస్థలో ఏమైనా లోపాలు ఉన్నాయని ఆడిటర్లు కనుగొన్నట్లైతే వాటిని పరిశీలించేందుకు దర్యాప్తులో సాయపడాల్సిందిగా కోరుతూ గత వారం ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఇ అండ్ వై ఎగ్జిక్యూటివ్‌లను కోరింది. పొరుగు దేశానికి చెందిన హ్యాకర్ల పని అంటూ మేరకే రెండు మాసాల క్రితమే ఎయిమ్స్ సర్వర్లపై దాడి మొదలైందని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

'రావణ్' వ్యాఖ్యలకు బిజెపి వక్రీకరణ : ఖర్గే

అహ్మదాబాద్ : గుజరాత్ ఎన్నికల ప్రచార సరళిపై స్పందిస్తూ తాను చేసిన 'రావణ్' వ్యాఖ్యలను బిజెపి వక్రీకరిస్తోందని కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే అన్నారు. 'గుజరాత్ మోడల్' అంతా డొల్ల అని తేలిన నేపథ్యంలో బిజెపికి ఓట్లు అడిగేందుకు ఏమీ మిగలలేదని, అందువల్ల విధానాలకు కాకుండా వ్యక్తిగత విద్వేషంతో నానాపాట్లు పడుతోందని ఆయన విమర్శించారు. ఎన్నికల ప్రచారసభల్లో పదేపదే 'నన్ను చూడండి' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓట్లడగం కోరడంపై స్పందిస్తూ 'మీకేమైనా రావణుడిలా పది తలలున్నాయా?' అంటూ ఖర్గే ఎద్దేవా చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలను మోడీ, బిజెపి నేతలు ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పేర్కొంటూ ఓట్ల ఎదుట వాపోతున్నారు. ఇది పెద్ద నాటకమని, దీనికంటే ప్రాధాన్యమైన సమస్యలు కావాలని బిజెపి నేతలు, మోడీ విస్మరిస్తున్నారని ఖర్గే అన్నారు.

కాశ్మీర్ ఫైల్స్‌పై ఇజ్రాయిలీ డైరెక్టర్ వ్యాఖ్యలకు జ్యూరీ సభ్యుల మద్దతు

న్యూఢిల్లీ : భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ) లో ప్రదర్శితమైన కాశ్మీర్ ఫైల్స్ చిత్రం అసభ్యకరంగా వుందంటూ ఇజ్రాయిలీ డైరెక్టర్, అంతర్జాతీయ జ్యూరీ హెడ్ నదవ్ లపిడ్ వ్యాఖ్యానించి పలు శీర్షికల్లోకి ఎక్కిన కొద్ది రోజుల తర్వాత జ్యూరీ సభ్యులందరూ ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఒక ప్రకటన జారీ చేశారు. జ్యూరీ సభ్యుల్లో వున్న ఒకే ఒక భారతీయుడు దీనిపై సంతకం చేయలేదు.

సుందర్ పిచాయ్‌కు పద్మభూషణ్ అందజేత

వాషింగ్టన్ : భారత్ తనలో భాగమని, ఎక్కడికి వెళ్లినా ఆ వారసత్వాన్ని తనతో పాటు తీసుకు వెళతానని గూగుల్, ఆల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ అన్నారు. భారత ప్రభుత్వం అందించిన అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం పద్మభూషణ్‌ను పిచాయ్ శుక్రవారం అందుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి తరంజిత్ సింగ్ సంధు చేతుల మీదుగా శాన్‌ఫ్రాన్సిస్కోలో పిచాయ్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. వాణిజ్యం, పరిశ్రమల విభాగంలో పద్మభూషణ్‌ను అందుకున్నారు. మదురైలో జన్మించిన పిచాయ్ ఈ ఏడాది ప్రారంభంలో 17 మంది అవార్డు గ్రహీతలలో ఒకరిగా ఎంపికయ్యారు.



గోద్రా కేసులో బెయిల్ పిటిషన్లను వ్యతిరేకించిన గుజరాత్ సర్కార్

అహ్మదాబాద్ : గోద్రా అల్లర్ల కేసులో కొంతమంది దోషుల బెయిల్ పిటిషన్లను గుజరాత్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యతిరేకించింది. కేవలం రాళ్లు విసరడంతోనే వాళ్ళు ఆగిపోలేదని, తగలబడుతున్న కోచ్ నుంచి ప్రజలు తప్పించుకోకుండా వారి చర్యలు అడ్డుకున్నాయని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహలతో కూడిన బెంచ్ శుక్రవారం ఈ కేసును విచారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఇప్పటికే జైల్లో 17, 18 ఏళ్లు గడిపినందున వారి బెయిల్ పిటిషన్లను పరిశీలించనున్నట్లు బెంచ్ తెలిపింది.

ఎఐకెఎస్ అఖిల భారత మహాసభల సందర్భంగా
అమరవీరుల జ్యోతి యాత్రలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎఐకెఎస్ అఖిల భారత మహాసభ సందర్భంగా అమరవీరుల జ్యోతి యాత్రలు ప్రారంభం కానున్నాయి. వ్యవసాయంలో కార్పొరేటీకరణను ప్రతిఘటించేందుకు యాత్రలను నిర్వహిస్తున్నట్లు ఎఐకెఎస్ తెలిపింది. తెలంగాణలోని జనగామాతోపాటు క్వీజ్వెన్మణి, సేలం జైలు, కయ్యూరు, పున్నప్రా వాయలార్ ప్రాంతాల నుంచి అమరవీరుల జ్యోతి యాత్రలు, జెండా మార్చ్‌లు, జాతాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళలోని త్రిసూర్‌లో ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా అమరవీరుల జ్యోతి యాత్ర, షహీద్ జ్యోతి యాత్ర, జెండా జాతా, ఫ్లాగ్ పోస్ట్ జాతాలను నిర్వహిస్తున్నట్లు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, హన్నన్ మొల్లా తెలిపారు. ఈ నెల 12 సాయంత్రం 4 గంటలకు త్రిసూర్‌కు యాత్రలన్నీ చేరుకుంటాయని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట చారిత్రాత్మక ప్రాంతమైన మొదటి అమరవీరుడు దొడ్డి కొమరయ్య గ్రామమైన జనగాంలోని కడవెండి నుండి అమరవీరుల జ్యోతి యాత్రను ఈ నెల 5 ఉదయం 10 గంటలకు ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లా రెడ్డి ప్రారంభిస్తారు. ఎఐకెఎస్ నేతలు పి. కృష్ణప్రసాద్, టి సాగర్, ఎం ప్రకాశన్ మాస్టర్, డి రవీంద్రన్, కెపి పెరుమాల్, ఢిల్లీబాబు జాతాకు నాయకత్వం వహిస్తారు. అగ్రవర్ణ భూస్వాములు, వారి గూండాలు 44 మంది వ్యవసాయ కార్మికులను ఊచకోత కోసిన ప్రాంతం తమిళనాడులోని కీజ్వెన్మణి నుంచి అమరవీరుల జ్యోతి యాత్రను ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఎఐకెఎస్ మాజీ అధ్యక్షుడు ఎన్. శంకరయ్య ప్రారంభించనున్నారు. ఈ యాత్రకు నాయకులు విజూ కృష్ణన్, ఎస్‌కె ప్రీజ, సామి నటరాజన్, దురైరాజ్ నాయకత్వం వహిస్తారు. ఈ రెండు యాత్రలు సేలంలో కలుస్తాయి. 1950 ఫిబ్రవరి 11న పోలీసు కాల్పుల్లో మరణించిన కిసాన్ ఉద్యమ నాయకులతో సహా 22 మంది అమరవీరులకు సేలంలో నివాళులర్పిస్తారు. ఆ తరువాత యాత్ర కేరళకు బయలు దేరుతోంది. ఈ నెల 8న ఉదయం తొమ్మిది గంటలకు కయ్యూరు అమరవీరుల స్మారక చిహ్నం నుంచి జెండా స్తంభం జాతాను ఎఐకెఎస్ సంయుక్త కార్యదర్శి ఇపి జయరాజన్ ప్రారంభిస్తారు. ఈ జాతాకు పనోలి వల్సన్, వి ఎం షౌకత్ నాయకత్వం వహిస్తారు. ఈ నెల 9న సాయంత్రం 4 గంటలకు అలప్పుజాలోని వలియా చూడుకాడ్‌లోని పున్నప్రా వాయలార్ అమరవీరుల స్మారక స్థూపం నుంచి జెండా జాతా ప్రారంభమవుతుంది. ఎఐకెఎస్ ఉపాధ్యక్షుడు ఎస్. రామచంద్రన్ పిళ్లై జెండాను అందజేస్తారు. ఈ జాతాకు ఎం విజయకుమార్, జార్జ్ మాథ్యూ నాయకత్వం వహిస్తారు. యాత్రలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తాయని, ఎఐకెఎస్ 35వ అఖిల భారత మహాసభల సందేశాన్ని తెలియజేస్తాయని అశోక్ ధావలే, హన్నన్ మొల్లా తెలిపారు. "ప్రత్యామ్నాయం కోసం పోరాటం, సమీకరణతో ముందుకు సాగడం" నినాదంతో యాత్రలు మహాసభల ప్రత్యేకతలను వివరిస్తాయని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం చారిత్రక పోరాటంలో భాగంగా వీరోచిత పోరాట ప్రాంతాల నుంచి విస్తృతమైన యాత్రలు, జాతాలు సాగనున్నాయి. మోడీ పాలనలో ప్రజలపై భారాలు, కార్పొరేట్ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం పోరాటానికి బలం చేకూర్చుతాయని తెలిపారు.



మీకోసం

ఒక గ్లాసు గోరువెచ్చటి నీటిలో కొద్దిగా పటిక బెల్లం, నిమ్మరసం కలిపి తాగితే కఫం కరిగిపోయి పొడిదగ్గు తగ్గుతుంది.

జీవన సౌరభం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమే.. కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతం.

అహం పనికిరాదు



ఒక అడవిలో తెల్ల పక్షులు, నల్ల పక్షుల సమూహాలు జీవిస్తున్నాయి. తెల్ల పక్షులు చాలా గర్వంగా ఉండేవి. ఆ జట్టు నాయకుడు నల్ల పక్షులు కనిపించిన ప్రతిసారీ హేళన చేస్తూ ఉండేవారు.

'ఈ సృష్టిలో అందమంతా మా సొంతం. మీరు నల్లగా, పొడవైన గోళ్ళతో, వాడిగల ముక్కుతో చూడటానికే అసహ్యంగా కనిపిస్తున్నాయి. అందువల్ల మా జాతి ఈ భూప్రపంచంలోనే గొప్ప' అని బీరాలు పలికాడు.


'అందమనేది శాశ్వతం కాదు. కొంతకాలానికి అది నశిస్తుంది. మనం చేసిన మంచి పనులే శాశ్వతం' అని నల్ల పక్షుల జట్టు నాయకుడు తోటి పక్షులకు చెప్పి ధైర్యాన్నిస్తూ ఉండేవారు.

ఒక రోజు తెల్ల పక్షుల జట్టు నాయకుడు నేలపై నడుస్తూ కేరింతలు కొడుతూ మైమరచి నృత్యం చేయసాగాడు. దాన్ని చూసిన మిగిలిన పక్షులూ నేల మీద దిగి గంతులేయసాగాయి. అక్కడ వేటగాళ్ళు పెట్టిన సన్నని వలలను ఆ పక్షులు గమనించకపోవడం వల్ల వాటి కాళ్ళు అందులో ఇరుక్కుపోయాయి.

ఆ రోజు వర్షం కురవడం వల్ల వేటగాళ్ళు రాలేదు. ఒకరోజల్లా ఆకలితో బిక్కుబిక్కుమని నిలువుకాళ్ళపై నిలబడ్డాయి. మరుసటిరోజు ఉదయాన్నే నల్ల పక్షులు అక్కడికి వచ్చి తమ బలమైన గోళ్ళతో రక్కి, ముక్కుతో కొరికి బంధవిముక్తుల్ని చేశాయి. ఆ తరువాత తమతో తెచ్చిన ఆహారాన్ని వాటికి తినిపించాయి.

అప్పుడు నల్ల పక్షుల నాయకుడు 'తెల్లగా ఉన్నంత మాత్రాన ఏ జాతి గొప్ప కాదు మిత్రమా! ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న జాతి, ఆకలిగొన్నవారికి పట్టెడు మెతుకులు పెట్టే జాతి, తోటివారిని హేళన చేయకుండా వారి మనోభావాలను గౌరవించే జాతి, ఇతరుల కష్టాన్ని గుర్తించే జాతి గొప్పది' అని హితవు పలికాడు. ఆ రోజు నుంచి తెల్ల పక్షులు అన్ని జాతుల పక్షులతో స్నేహంగా మెలగసాగాయి.

- షేక్ అబ్దుల్ హకీం జాని
99494 29827



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 169

నేను గీసిన బొమ్మ



- గుర్రం హాసిని,
8వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



స్టాఫ్ నర్సుగా ఝాన్సీరాణి తన వృత్తి పట్ల గౌరవం, నిబద్ధతే తనను ఈ స్థాయికి తీసుకు వచ్చాయి. వైద్యసేవల్లో ఎప్పటికప్పుడు వచ్చే మార్పులు తెలుసుకుంటూ వృత్తిలో నైపుణ్యం సాధించారు. అత్యవసర వేళల్లో అంకితభావంతో పనివేళలతో సంబంధం లేకుండా సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో భర్త చనిపోయినా ఆ బాధను భరిస్తూనే రోగులకు ధైర్యాన్నిచ్చారు. ఇప్పుడు కూడా అర్ధరాత్రయినా సిబ్బందికి, రోగులకు ఫోన్లో స్పందిస్తూ సూచనలు ఇస్తారు. ఎంతోమందికి రక్తదానం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. అందుకు గానూ ఆమెను 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు-2021' వరించింది.

మన నైటింగేల్

విజయవాడలో అయోధ్యనగర్‌కు చెందిన ఝాన్సీరాణి ఉద్యోగ కుటుంబానికి చెందిన వారు. తల్లి దేవి కృపామణి గృహిణి. తండ్రి ఆనంద పిళ్లై రైల్వే లోకో పైలెట్. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. రెండో కూతురు ఝాన్సీ. నానమ్మ, ముగ్గురు మేనత్తలు, వారి కుటుంబసభ్యులు, పిల్లలు అంతా కలిసే ఉండేవారు. బాల్యం నుంచీ ఉమ్మడి కుటుంబంలో ఉంటున్నారు. దాంతో కుటుంబంలో ఏ సమస్య వచ్చినా, ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురైనా, వృత్తి రీత్యా ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా ఒకరికొకరు తోడు నిలుస్తూ, సహకారం అందించుకుంటూ ఉండేవారు.

ఇటువంటి వాతావరణంలో పెరిగిన ఆమె ఇతరుల పట్ల సేవాగుణాన్ని అలవరుచుకున్నారు. చదువులోనూ, ఆటల్లోనూ ఎంతో చురుకుగ్గా ఉండేవారు. రైల్వేజోన్‌లో జరిగే కల్చరల్, క్రీడ విభాగాల్లో పాల్గొని ఎన్నో బహుమతులు సాధించారు. అక్క ప్రసన్నలక్ష్మి సూచన మేరకు ఇంటర్ తర్వాత బిఎస్సీ నర్సింగ్‌లో చేరారు. అమెరికన్ సెంటాన్స్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో పీబీ బీఎస్సీ(ఎన్) కోర్సు చేశారు. పాఠాలను ఎలా గుర్తుపెట్టుకోవాలి, ల్యాబ్ పరీక్షలు ఎలా చేయాలి, వృత్తి పట్ల ఎలా మసులుకోవాలి వంటి విషయాలను అక్క ఎప్పటికప్పుడు గైడ్ చేస్తూండేవారు. చదువు అయిన వెంటనే వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ నాగేశ్వరరావును ఇంట్లో పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. విజయవాడ జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూనే ఇన్‌సర్వీస్ ఎడ్యుకేషన్ కింద భర్త ప్రోత్సాహంతో ఆమె చదువు కొనసాగించారు. బెంగుళూరు, చెన్నై నగరాల్లో మూడు, నాలుగు నెలల పాటు శిక్షణ తీసుకుని వృత్తిలో 13 సర్టిఫికేట్లు సాధించారు.

ఆయనే అన్నీ భరించారు

'ఉన్నత స్థాయిలో ఉన్న ఆడవాళ్లు సైతం పిల్లల్ని, కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. నేను అలా కాదు. పిల్లల్ని మాత్రమే నేను కన్నాను. పెంచింది మాత్రం ఆయనే. నేను చేసే వృత్తి చాలా గొప్పదని ఆయన ఎప్పటికీ భావించేవారు. అందుకే పిల్లల్ని పుట్టిన కొన్ని నెలలకే ఉద్యోగంలో చేరాను. అప్పటి నుంచి వాళ్ల అవసరాలు, చదువులు, ఉద్యోగంలో స్థిరపడే వరకూ అన్నీ ఆయనే బాధ్యతవహించారు. నన్నూ అలాగే చూసుకున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తూనే, ప్రతిరోజూ వంటచేసి, బాక్సు కట్టి, హాస్పటల్లో దించేవారు. నా డ్యూటీ అయిన వెంటనే వచ్చి తీసుకెళ్లేవారు. ఏ సమయంలోనైనా నా వెన్నంటే ఉన్నారు. పిల్లలకు నేను లేని లోటు తీర్చారు. దాంతో ఎటువంటి ఇబ్బందులూ, ఒత్తిడి లేకుండా వృత్తిలో క్రమశిక్షణతో విధులు నిర్వహించగలిగాను.' అని అంటారు ఝాన్సీ.

కీలక సమయాల్లోనూ...

విజయవాడ ఆసుపత్రిలో 25 ఏళ్లు ఐసీయూ, ట్రామా, ఎమర్జింగ్, న్యూరో, బర్న్స్, లెప్రసీ, ఆంకాలజీ, బ్లడ్ బ్యాంకు, దిశా కౌన్సిలింగ్ సెంటర్...ఇలా అన్ని విభాగాల్లోనూ బాధ్యతలు నిర్వహించారు ఆమె. ఇంటి దగ్గర ఎన్ని పనులున్నా కాదనకుండా అవసరాన్నిబట్టి మూడు షిఫ్ట్‌ల్లోనూ పనిచేసేవారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు సిఎం కాన్వాయ్‌లో అంబెలెన్సులోనూ ఝాన్సీ విధులు నిర్వహించారు. ఒకసారి ఆయన ఎకోస్ప్రిన్ టాబ్లెట్, మందులు అడిగారు. అవి డాక్టర్ల దగ్గర లేదు. ఆ విషయం చెప్పడానికి అందరూ భయపడుతున్నారు. వెంటనే ఝాన్సీ సమయస్ఫూర్తితో వ్యవహరించారు. ఆ మందులను విజయవాడ ఆసుపత్రి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు సిబ్బంది ద్వారా వెంటనే తెప్పించి ఇచ్చారు. ఒకసారి బ్లడ్ బ్యాంకుకు ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వచ్చారు. రక్తం తీసిన వెంటనే కళ్లు తిరిగి పడిపోయారు. అతని తల పగలి రక్తం కారింది. చికిత్స చేసే డాక్టర్ అందుబాటులో



లేకపోవడతో ఆమె దగ్గరుండి వైద్యం చేశారు. మరో ఆసుపత్రికి ఆటోలో తీసుకెళ్లి, తల స్కానింగ్ చేయించి ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పలువురు గర్భిణీలకు కాన్పు సమయంలో ధైర్యం చెప్పి, ఆపరేషన్ అయ్యే పరిస్థితి నుంచి మామూలు కాన్పు అయ్యేలా చేశారు. కొత్తగా వచ్చిన డాక్టర్లను, తోటి సిబ్బందికీ తల్లో నాలుకలా ఉండేవారు. ఇతర ప్రాంత్రాల్లో నిర్వహించే క్యాంపుల్లో వైద్యుల వెంట కీలక పాత్ర పోషించి 34 ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగే కల్చరల్, క్రీడా పోటీల్లో పాల్గొని బహుమతులూ సొంతం చేసుకున్నారు.



భర్త, అక్క చనిపోయినా

తన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన అక్క ప్రసన్న లక్ష్మి, భర్త శివనాగేశ్వరావు ఫస్ట్ కోవిడ్ సమయంలో వైరస్ బారినపడ్డారు. పరిస్థితి విషమించి వెంటిలేటర్‌పై ఉంచారు. ఝాన్సీ ఏడుస్తూనే దగ్గరుండి వైద్యసేవలు చేశారు. తనను ఎంతగానో ప్రేమించిన వ్యక్తి తన చేతుల్లోనే తుదిశ్వాస విడవడంతో కృంగిపోయారు. తరువాతి వారం రోజుల్లో అక్కా చనిపోయారు. ఇంట్లో తీవ్ర విషాదం... మనసులో ఆ బాధను భరిస్తూనే ఆమె విధులు నిర్వర్తించి తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది మొత్తం భయపడిపోయారు. ఝాన్సీ మాత్రం అందరికీ ధైర్యం చెబుతూ, రోగులకు సేవలందించారు. ఆమె సేవలు, ప్రతిభను గుర్తించి విదేశాల్లోనూ అవకాశాలు వచ్చినా విజయవాడ ఆసుపత్రికి ప్రాధాన్యత ఇచ్చి ఇక్కడే ఉన్నారు.

'టీంలో ఒకరికి గుర్తింపు వచ్చిందంటే.. ఆ విజయం ఆ టీం మొత్తానిది. నర్సుగా నేను డ్యూటీలో ఉన్నప్పుడు మాత్రమే రోగికి సపర్యలు చేయగలుగుతాను. కాని ఆ తర్వాత వచ్చిన నర్సులు కూడా జాగ్రత్తగా చూసుకోబట్టే రోగులు త్వరగా కోలుకుని ఇంటికి వెళుతున్నారు. అందుకే ఈ గుర్తింపు అవార్డు మా ఆసుపత్రి వైద్యసిబ్బంది అందరిదీ' అంటారు ఝాన్సీ.

- పద్మావతి



సంక్రాంతికే 'వీర సింహారెడ్డి'

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వీర సింహారెడ్డి' తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జనవరి 12న ఈ సినిమా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. గోపీచంద్ మలినేని డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయిక. దునియా విజయ్, వరలక్ష్మి శరత్‌కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.

నేనెంతో గర్విస్తున్నా...



రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు రావడం పట్ల చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'కంగ్రాట్స్ డియర్ చరణ్. ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియాలో ట్రూ లెజెండ్ అవార్డు నువ్వు అందుకున్నందుకు నేనెంతో గర్విస్తున్నా. నువ్వు ఇలాగే ముందుకు సాగాలని అమ్మా నేను కోరుకుంటున్నాం.' అని చిరు ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కి చరణ్ స్పందిస్తూ.. 'లవ్ యూ అప్పా' అని రిప్లై ఇచ్చారు. ప్రముఖ ఆంగ్ల పత్రికా సంస్థ ఇటీవల వివిధ రంగాల్లో విశేషమైన సేవలను అందించిన పలువురు ప్రముఖులకు ఫ్యూచర్ ఆఫ్ యంగ్ ఇండియా అవార్డులను అందజేసింది. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో రామ్‌చరణ్‌కి ట్రూ లెజెండ్ అవార్డు లభించింది. ఈ అవార్డును చరణ్ తన తండ్రి చిరంజీవికి అంకితం చేశారు.




'టాప్ గేర్' టీజర్ విడుదల

ఆది సాయికుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'టాప్ గేర్' నుంచి శనివారం దర్శకుడు మారుతి టీజర్ విడుదల చేశారు. ఈ సినిమాలో రియా సుమన్ కథానాయికగా నటించారు. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కె.శశికాంత్ తెరకెక్కిస్తున్నారు. శ్రీధనలక్ష్మీ ప్రొడక్షన్స్ ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో కె.వి. శ్రీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 30న ఈ చిత్రం భారీ స్థాయిలో విడుదలవ్వబోతోంది. సినిమాలో ఆది సాయికుమార్ టాక్సీ నడిపే వ్యక్తిగా కనిపించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించారు. కీలక పాత్రల్లో బ్రహ్మాజీ, సత్యం రాజేష్, మైమ్ గోపీ, నర్రా శ్రీను బెనర్జి చమ్మక్ చంద్ర, రేడియో మిర్చి హేమంత్ తదితరులు నటిస్తున్నారు.

శరవేగంగా 'కీడా కోలా' చిత్రీకరణ



డైరెక్టర్ తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో క్రైమ్ కామెడీ చిత్రంగా రాబోతున్న 'కీడా కోలా' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. విజి సైన్మా బ్యానర్ పై ప్రొడక్షన్ నంబర్ 1 గా తెరకెక్కబోతోన్న ఈ చిత్రం మొదటి షెడ్యూల్ పూర్తయి శనివారం నుంచి రెండో షెడ్యూల్‌ను ప్రారంభించింది. శ్రీపాద నందిరాజ్, సాయికృష్ణ గద్వాల్, ఉపేంద్ర వర్మ, వివేక్ సుధాంషు, కౌశిక్ నండూరి నిర్మిస్తున్న ఈ చిత్రం 2023లో పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియచేస్తామంటున్నారు నిర్మాతలు.



రాజమౌళి ఖాతాలో మరో అవార్డు

శాటర్న్, సన్‌సెట్ సర్కిల్ వంటి అంతర్జాతీయ అవార్డులను సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ ఇప్పుడు మరో విశేష ఘనత సొంతం చేసుకుంది. హాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ది న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్' అవార్డు ఈ చిత్రాన్ని వరించింది. అమెరికాలో తాజాగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి గానూ ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఈ అవార్డు సొంతం చేసుకున్నారు. దీంతో రాజమౌళికి అభినందనలు చెబుతూ సినీ ప్రియులు పోస్టులు పెడుతున్నారు. వార్తా పత్రికలు, మ్యాగజైన్స్, ఆన్‌లైన్ పబ్లికేషన్స్‌కు సంబంధించిన పలువురు ప్రముఖులు ఒక బందంగా ఏర్పడి 1935 నుంచి సినీ పరిశ్రమలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డులను అందజేస్తున్నారు.

క్వార్టర్స్‌కు నెదర్లాండ్స్

ప్రి క్వార్టర్స్‌లో అమెరికాపై 3-1గోల్స్‌తో గెలుపు



దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 క్వార్టర్‌ఫైనల్లోకి నెదర్లాండ్స్ జట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ జట్టు 3-1గోల్స్ తేడాతో అమెరికాను ఓడించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికే నెదర్లాండ్స్ జట్టు 2-0గోల్స్ ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం 76వ ని.లో హాజీ రైట్ ఒక గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ ఆధిక్యత 2-1కి తగ్గింది. ఆ తర్వాత నెదర్లాండ్స్ జట్టు డెన్జెల్(81వ ని.) మరో గోల్ కొట్టడంతో నెదర్లాండ్స్ జట్టు తిరుగులేని 3-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్ డిఫెన్స్ ఛేదించడంలో అమెరికాజట్టు విఫలమైంది. దీంతో ఫిఫా ప్రపంచకప్-2022లో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లిన తొలి జట్టుగా నెదర్లాండ్స్ నిలిచింది. తొలి రెండో గోల్స్‌ను మెంఫిస్(10వ ని.), డెలే (45+1వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. అర్జెంటీనా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మరో ప్రి క్వార్టర్స్ మ్యాచ్ విజేతతో నెదర్లాండ్స్ జట్టు క్వార్టర్‌ఫైనల్లో తలపడనుంది.

ఓ సంచలనంతో కామరూన్...

గ్రూప్-జిలో కామరూన్ జట్టు పెను సంచలనాన్ని నమోదుచేసింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో కామరూన్ జట్టు 5సార్లు ఫిఫా ప్రపంచకప్ ఛాంపియన్ బ్రెజిల్‌ను ఓడించింది. కామరూన్ తరపున ఏకైక గోల్‌ను విన్సెంట్ 92వ నిమిషంలో చేశాడు. గోల్ కొట్టిన ఆనందంలో విన్సెంట్ అతని జెర్సీని విప్పి సంబరాలు చేసుకోవడంతో అతను రెడ్‌కార్డ్‌కు గురై మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆ తర్వాత బ్రెజిల్ పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ గ్రూప్ నుంచి సెర్బియా, స్విట్జర్లాండ్ జట్లు 6పాయింట్లతో టాప్-2లో నిలిచి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు ప్రవేశించాయి.

ప్రి క్వార్టర్‌ఫైనల్స్ షెడ్యూల్..

డిసెంబర్ 4: ఫ్రాన్స్ × పోలండ్(రా.8.30గం॥లకు)
ఇంగ్లండ్ × సెనెగల్(రా.12.30గం॥లకు)
డిసెంబర్ 5: జపాన్ × క్రొయేషియా(రా.8.30గం॥లకు)
బ్రెజిల్ × దక్షిణ కొరియా(రా.12.గం॥లకు)
డిసెంబర్ 6: మొరాకో × స్పెయిన్(రా.8.30గం॥లకు)
పోర్చుగల్ × స్విట్జర్లాండ్(రా.12.30గం॥లకు)



బ్రెజిల్‌పై గోల్ కొడుతున్న కామరూన్ ఆటగాడు విన్సెంట్



జెర్సీ తీసేయడంతో రెడ్‌కార్డ్ చూపుతున్న రిఫరీ

నాకౌట్ బెర్త్‌లు ఖరారు

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో గ్రూప్ దశ లీగ్ పోటీలు ముగిసాయి. శుక్రవారం రాత్రి బ్రెజిల్-కామరూన్ జట్ల మధ్య జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌తో ఈ సీజన్ ఫిఫా గ్రూప్ లీగ్ పోటీలు ముగిసాయి. 8గ్రూపుల ఫిఫా గ్రూప్ పోటీల్లో ఆతిథ్య కతార్‌తోపాటు ఆసియా ఖండానికి చెందిన ఇరాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, జపాన్ జట్లు సంచలన విజయాలను నమోదు చేసుకున్నాయి. గ్రూప్-సి తొలి లీగ్ పోటీలోనే సౌదీ అరేబియా జట్టు 2-1గోల్స్ తేడాతో అర్జెంటీనాకు ఓడించి పెను సంచలనాన్ని నమోదు చేయగా.. ఆ తర్వాత జపాన్ జట్టు జర్మనీని చిత్తుచేసి మరో సంచలనాన్ని తెరలేపింది. ఇదే క్రమంలో దక్షిణ కొరియా జట్టు ఉరుగ్వేలతో మ్యాచ్‌ను డ్రా చేసుకొని ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచింది. ఆతిథ్య కతార్ మినహా.. ఆసియా ఖండానికి చెందిన మిగిలిన నాలుగు జట్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత సౌదీ అరేబియా, ఇరాన్ జట్లు పోరాడినా ప్రి క్వార్టర్స్‌కు చేరడంలో విఫలమైతే.. చివరి లీగ్ మ్యాచుల్లో జపాన్ జట్టు స్పెయిన్‌ను, దక్షిణ కొరియా జట్టు పోర్చుగల్‌ను ఓడించి ఏకంగా నాకౌట్‌కు చేరుకున్నాయి.

లీగ్ దశలోనే నిష్క్రమించిన ఫేవరెట్ జట్లు..

లీగ్ దశలోనే ఈసారి టాప్‌క్లాస్ జట్లు నిష్క్రమించాయి. గ్రూప్-సిలో మెక్సికోతోపాటు, గ్రూప్ ఆఫ్ డెత్‌గా పరిగణించిన గ్రూప్-డిలో ట్యునీషియా, డెన్మార్క్ జట్లు లీగ్ దశను దాటలేకపోయాయి. అలాగే గ్రూప్-ఇ నుంచి మాజీ ఛాంపియన్ జర్మనీ, గ్రూప్-ఎఫ్‌లో బెల్జియంతోపాటు గ్రూప్-జి నుంచి కామరూన్, గ్రూప్-హెచ్ నుంచి మాజీ ఛాంప్ ఉరుగ్వే లీగ్ దశను దాటలేకపోయింది. ఈ జట్లన్నీ తొలి మ్యాచ్‌లో ఓటమి ఆ జట్టు నాకౌట్ బెర్త్ చేరికపై ప్రభావాన్ని చూపాయని చెప్పుకోవచ్చు. శనివారం నుంచి ప్రి క్వార్టర్‌ఫైనల్ పోటీలు ప్రారంభం కాగా.. 9నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

యువ క్రికెటర్లకు సదవకాశం

బంగ్లాదేశ్‌తో తొలి వన్డే నేడు
షమీ ఔట్.. ఉమ్రాన్ ఇన్..
ఉదయం 11.30గం॥ల నుంచి

ఢాకా: టీమిండియా జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో భాగంగా ఆదివారం నుంచి మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఇరుజట్ల మధ్య జరిగే తొలి వన్డేకు ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో జరగనుంది. వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా సీనియర్ పేసర్ షమీ ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భుజం గాయంతో షమీ ఇబ్బందిపడుతున్నట్లు బిసిసిఐ శనివారం ట్విట్టర్‌లో వెల్లడించింది. షమీ స్థానంలో భారత యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్‌కు జట్టులో చోటు కల్పించినట్లు పేర్కొంది. 'బంగ్లాతో వన్డే సిరీస్‌కు ముందు నిర్వహించిన ట్రైనింగ్ సెషన్‌లో షమీకి గాయమైంది. అతడు ప్రస్తుతం ఎన్‌సీఏ పర్యవేక్షణలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లిన జట్టుతో అతడు వెళ్లలేదు' అని బిసిసిఐ తెలిపింది. వన్డే సిరీస్ ముగిసిన అనంతరం 14 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది.



వన్డే సిరీస్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న భారత్, బంగ్లాదేశ్ కెప్టెన్లు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68